PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 191 | విజయవాడ, శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 16 February 2024 | Rs

వీసా, మాస్టర్ కార్డ్‌లపై ఆర్‌బిఐ కొరడా

- చెల్లింపులు నిలిపివేయాలని ఆదేశాలు

లోపలి పేజీలో..

ఎపి రీసెట్ నోటిఫికేషన్ విడుదల

- దరఖాస్తుకు మార్చి 19 చివరి గడువు

ప్రజాశక్తి - క్యాంపస్ (ఎస్‌వియు)

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పిహెచ్‌డి సీట్ల భర్తీకి ఎపి రీసెట్ 2023-24 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 20 నుంచి దరఖాస్తులు ప్రారంభమవుతాయని, మార్చి 19 చివరి గడువు అని రీసెట్ కన్వీనర్ దేవప్రసాద్ రాజు తెలిపారు. పరీక్షను ఎస్‌వి యూనివర్సిటీ నిర్వహిస్తోందని తెలిపారు. ఏప్రిల్ నాలుగు నుంచి ఏడు వరకు దరఖాస్తుల్లో సవరణలు, ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉదయం తొమ్మిది నుంచి పదకొండు గంటల వరకూ, మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకూ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని, సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు పొందిన వారు ప్రవేశ పరీక్షకు అర్హులని తెలిపారు.

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

రద్దు చేస్తూ సుప్రీం కోర్టు సంచలన తీర్పు

- సమాచార హక్కును హరిస్తోంది
- క్విడ్‌ప్రోకోకు దారితీస్తుంది
- వివరాలన్నీ వెబ్‌సైట్‌లో ఉంచాలని సిఇసికి ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల ముంగిట అధికార బిజెపికి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. 2018లో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్ల పథకాన్ని అత్యున్నత న్యాయస్థానం కొట్టి వేసింది. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని, సమాచార హక్కును హరించేదిగా ఉందని గురువారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఎన్నికల బాండ్ల జారీని తక్షణమే నిలిపివేయాలని ఎస్‌బిఐని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, బిఆర్ గవాయ్, జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు ఇచ్చింది. ఆర్టికల్ 19(1) (ఎ) లోని వాక్ స్వాతంత్ర్యాన్ని, పౌరుల భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును కూడా ఈ పథకం ఉల్లంఘిస్తోందని న్యాయస్థానం తెలిపింది. జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ ధర్మాసనం తీర్పు ఏకగ్రీవంగానే ఉంది. కారణాల విషయంలో మాత్రం స్వల్ప తేడా ఉన్నదని తీర్పును చదివిన జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు.

ఎలాంటి వివరాలు లేకుండా ఎన్నికల బాండ్లను స్వీకరించడం సమాచార హక్కుకు భంగకరమని ధర్మాసనం అభిప్రాయపడింది. నల్లధనానికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో సమాచార చట్టాన్ని ఉల్లంఘించడం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలకు అపరిమిత విరాళాలు అందజేయడాన్ని అనుమతిస్తూ కంపెనీల చట్టంలో చేసిన సవరణలు ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీలకు బాండ్ల రూపంలో విరాళాలు ఇవ్వడం క్విడ్‌ప్రోకోకు దారితీస్తుందని తెలిపింది. విరాళాలు అందించే వారి పేర్లు, వివరాలు రహస్యంగా ఉంచడం సరికాదని, ఇలా చేయడం ఆదాయపన్ను చట్టాన్ని కూడా ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 139తో సవరించిన సెక్షన్ 29(1)(సి), ఫైనాన్స్ యాక్ట్ సవరించిన సెక్షన్ 13(బి), ఆర్‌పిఎ, ఐటి చట్టంలో 29(1) సెక్షన్ సవరణ రాజ్యాంగ వ్యతిరేకం అవుతుందన్నారు.

2019 ఏప్రిల్ 12వ తేదీ నుండి ఇప్పటి వరకూ విక్రయించిన ఎన్నికల బాండ్ల వివరాలను మార్చి 6వ తేదీలోగా కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేయాలని ఎస్‌బిఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. పార్టీలకు విరాళాలు ఇచ్చింది ఎవరు, ఏ పార్టీకి ఇచ్చారు, ఎంత మొత్తంలో అందించారు వంటి వివరాలను మార్చి 13వ తేదీలోగా వెబ్‌సైట్‌లో ఉంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. రాజకీయ పార్టీలు తమకు అందిన ఎన్నికల బాండ్లను సొమ్ము చేసుకోని పక్షంలో వాటిని దాతలకు వాపసు చేయాలని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని మోడీ ప్రభుత్వం 2018 ప్రారంభంలో తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా వ్యక్తులు లేదా కంపెనీలు రాజకీయ పార్టీలకు అపరిమితంగా విరాళాలు అందజేయవచ్చు.

కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి కంపెనీలు కాంట్రాక్టుల ద్వారా చేకూరిన లబ్ధికి ప్రతిఫలంగా చెల్లించే ముడుపులకు ఇదొక రాచమార్గంగా ఉంది. ప్రభుత్వం ద్వారా ఆయాచితంగా లబ్ధిపొందే క్రోనీ కేపిటలిస్టు, విదేశీ కంపెనీలు ఇండియాలోని తమ ఏజెంట్ల ద్వారా ఈ బాండ్లను కొనుగోలు చేసి అధికార పార్టీకి ఇచ్చేందుకు మిగతా 7లో

చారిత్రాత్మక తీర్పు : సిపిఎం

ఇది చారిత్రాత్మక తీర్పు. అవినీతిని చట్టబద్ధం చేస్తున్న ఈ ఎన్నికల బాండ్లను ఆమోదించే ప్రసక్తే లేదని సిపిఎం మొదటి నుంచి చెబుతూవస్తోంది. ఇతర పిటిషనర్లతో కలిసి సుప్రీంకోర్టులో సవాలు చేసింది. రాజకీయపార్టీలకు అందే నిధులు పారదర్శకంగా, స్వచ్ఛంగా ఉండేలా చూసేందుకు, అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయ, ఎన్నికల నిధుల సమీకరణ నిబంధనల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

– సిపిఎం పొలిట్‌బ్యూరో

మోడీ అవినీతికి మరో రుజువు : రాహుల్ గాంధీ

ప్రధాని నరేంద్ర మోడీ అవినీతి విధానాలకు ఈ తీర్పు మరో రుజువు. ముడుపులు, తీసుకోవడానికి ఎన్నికల బాండ్లను మార్గంగా బిజెపి ఎంచుకుంది.

తీర్పును గౌరవిస్తాం : రవి శంకర్, బిజెపి నేత

ఎన్నికల నిధుల సమీకరణలో పారదర్శకతను తీసుకురావడమే ఎన్నికల బాండ్ల లక్ష్యం. అయినా, ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పును గౌరవిస్తున్నాం.

సమగ్రతను కాపాడే తీర్పు : స్టాలిన్, తమిళనాడు సిఎం

సుప్రీం తీర్పు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను, సమగ్రతను కాపాడుతుంది. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తుంది.



వలంటీర్లకు ఇచ్చే అవార్డుల సొమ్ము చెక్కును అందిస్తున్న సిఎం

తిరుపతి జూలో దారుణం

- సింహం దాడిలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

తిరుపతి శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శన శాలలో దారుణం చోటుచేసుకుంది. సింహం దాడిలో యువకుడు దుర్మరణం చెందారు. గురువారం చోటుచేసుకున్న ఈ ఘటన సంచలనం కలిగించింది. జూ అధికారులు, పోలీసుల కథనం ప్రకారం... జూ పార్కు సందర్శనకు వచ్చిన రాజస్థాన్ రాష్ట్రం బన్సూర్ ఆల్వార్ జిల్లా తురానా గ్రామానికి చెందిన ప్రహ్లాద్ గుర్జార్ (38) ఒంటరిగా సింహాలు ఉన్న ప్రాంతానికి వెళ్లారు.

ఆ ప్రాంతానికి జూ అధికారులు రెండు ప్రధాన గేట్లు ఏర్పాటు చేశారు. ప్రధాన గేటు పది అడుగులు, ఎన్ క్లోజర్ గేటు 12 అడుగులు ఎత్తు ఉన్నాయి. ప్రహ్లాద్ ప్రధాన గేటు దాటుకొని ఎన్ క్లోజర్ గేటు పైకిఎక్కి ఒక్కసారిగా లోపలికి దూకాడు. ఆయనను చూసిన దొంగల్ పూర్ అనే మగ సింహం ఒక్కసారిగా దాడి చేసింది. సింహం నుండి ప్రాణాలు కాపాడుకోవడానికి ఆ ఎన్ క్లోజర్‌లోని చెట్టుపై ఎక్కేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సింహం ఆయన ఛాతీ భాగంలో గట్టిగా కొరకడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ఆయన ఒంటిపై ఉన్న దుస్తులు పూర్తిగా తొలగిపోయాయి.

జూ సిబ్బంది ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ డిఎస్‌పి శరత్‌రాజ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ప్రహ్లాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రహ్లాద్ గుర్జార్ మృతదేహం



దాడి చేసిన సింహం

ప్రజా కోర్టులోనూ బిజెపిని ఓడిస్తాం

- కేంద్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి గ్రామీణ బంద్ జయప్రదం చేస్తాం
- ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు

లోపలి పేజీలో..

రాజధాని పేదలకు పింఛను పెంపు

- సేవచేసే వాలంటీర్లే రేపటి లీడర్లు... వారే నా సైన్యం
- యుద్ధానికి సిద్ధం కండి
- వాలంటీర్ల అభినందన సభలో సిఎం జగన్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని ప్రాంతంలో వ్యవసాయ కార్మికులకు, నిరుపేదలకు ఇస్తున్న పింఛను మొత్తాన్ని పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం రేపూడిలో గురువారం జరిగిన వాలంటీర్ల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. విశేష సేవలందించిన వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజధాని ప్రాంత నిరుపేదల సమస్యలను ప్రస్తావించారు. అమరావతిలో వ్యవసాయ భూములన్నీ భూ సమీకరణలో రాజధాని నిర్మాణానికి ఇవ్వడం వల్ల పనులు లేకుండా ఇబ్బంది పడుతున్న భూమిలేని వ్యవసాయ కార్మికులకు, నిరుపేదలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.2,500 పింఛనును రూ.5 వేలకు పెంచుతున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. టిడిపి రూపొందించిన ఆరు పథకాల కిచిడీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మవద్దని అన్నారు. ఎన్నికలయ్యాక ఈ మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేస్తారని చెప్పారు. చంద్రబాబు జన్మభూమి కమిటీలు గంజాయి మొక్కలయితే, తాము తీసుకొచ్చిన సచివాలయాల వ్యవస్థ తులసి మొక్కలని అభివర్ణించారు. ఈ వ్యవస్థ ద్వారా వాలంటీర్లు ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తున్నారని చెప్పారు. 'సూర్యుడు ఉదయించకముందే ఇంటి ముందుకు వెళ్లి తలుపుతట్టి పింఛను ఇస్తున్నారు. కుల, మతాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నారు' అని అన్నారు. ప్రజలకు సేవ చేసే వాలంటీర్లే రేపటి లీడర్లు అవుతారని, అటువంటి వారే తన సైన్యం అని చెప్పారు. చంద్రబాబు కూటమిని ఎదుర్కొనేందుకు రాబోయే రెండు నెలల్లో చొక్కాలు మడత పెట్టి యుద్ధానికి సిద్ధం కావాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు.

జన్మభూమి కమిటీల వల్ల పేదలు నష్టపోయారన్నారు. పేదలకు మేలు చేయాలన్న ఆలోచన చంద్రబాబుకు ఏనాడూ లేదని విమర్శించారు. చంద్రబాబు పాలన పేదల పాలిట విష వృక్షమని, వైసిపి పాలన కల్పవృక్షం అని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల కోసం తాను గత ఐదేళ్లుగా ఏడాదికి రూ.70 వేల కోట్ల చొప్పున డిబిటి ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశానని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే తాను అమలు చేసిన పథకాలను కొనసాగించడంతోపాటు వారు ప్రకటించిన మేనిఫెస్టో అమలుకు మిగతా 7లో

టిడిపికి కిశోర్ చంద్రదేవ్ రాజీనామా

ప్రజాశక్తి- కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

తెలుగుదేశం పార్టీకి కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్ర సూర్యనారాయణదేవ్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడకు ఆయన బహిరంగ లేఖ రాయడంతో పాటు ఫ్యాక్స్ ద్వారా పంపారు. ఎన్‌డిఎలో టిడిపి చేరే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ లేఖలో పేర్కొన్నారు . 'మన భిన్నత్వం మధ్య ఐక్యత మన రాజ్యాంగానికి హాల్ మార్క్. దానిని చిన్నాభిన్నం చేయడానికి మతోన్మాదులు ప్రయత్నిస్తున్నారు. బీభత్స పాలనకు తెరలేపడం ద్వారా ఓటు బ్యాంకులను సృష్టించుకోవడమే ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వ కార్యక్రమంగా కనిపిస్తోంది. నా రాజకీయ జీవితంలో 5వ దశాబ్దంలో నేను చూసిన అత్యంత దారుణమైన పరిస్థితి ఇది. విద్వేష శక్తులతో చేతులు కలపడం సహించరాని విషయం. అధికారం కోసం నా ఆత్మను అమ్ముకోలేను' అని లేఖలో పేర్కొన్నారు. ప్రత్యేకహోదాతోను ఎన్‌డిఎ తిరస్కరించడం, నల్లధనాన్ని వెనక్కి తీసుకువచ్చి ప్రజల ఖాతాల్లో వేస్తామంటూ ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడం తదితర అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు.

రైతుల ఆందోళన ఉధృతం

- పంజాబ్‌లో పలు చోట్ల రైల్ రోకో
- ఉద్యమంపై హర్యానా ప్రభుత్వ నిర్బంధం
- నేడు దేశవ్యాపిత గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె

పంజాబ్‌లో రైల్ రోకో నిర్వహిస్తున్న రైతులు

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

గత రెండు రోజులుగా రైతులు చేస్తున్న ఆందోళన గురువారం మరింత ఉధృతమైంది. పంజాబ్‌లో రైతులు 'రైల్ రోకో' నిర్వహించారు. మాన్సా, బర్నాలా, రాజ్‌పురా తదితర చోట్ల రైలు ట్రాక్‌లను రైతులు దిగ్బంధించారు. పాదయాత్ర ద్వారా ఢిల్లీ వైపుగా కదులుతున్న రైతులను అడ్డుకునేందుకు హర్యానాలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. మరో వైపు సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామీణ బంద్ కొనసాగుతుందని రైతు సంఘాల నేతలు ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాతీయ రహదారులను స్తంభింపజేస్తామని తెలిపారు. గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పంజాబ్-హర్యానా సరిహద్దుల వద్ద ఆందోళనల్లో రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రైతులతో ప్రధాని నరేంద్ర మోడీ చర్చలు జరిపి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని పంజాబ్ కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి శర్వన్ సింగ్ పాంథర్ కోరారు. ప్రధాని మోడీ నేరుగా రైతు నేతలతో సంప్రదింపులు జరపాలని తాము గతంలోనూ కోరామని గుర్తు చేశారు. శాంతియుతంగా ప్రదర్శన చేపడతామని, బారికేడ్లు పగులకొడతామని చెప్పడం లేదని అన్నారు. మనది ప్రజాస్వామ్య దేశమని, ఢిల్లీలో ప్రశాంతంగా తమ ఉద్యమం చేపట్టేలా అనుమతించాలని కోరారు.

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2020 నుండి నవంబర్ 2021 వరకు ఢిల్లీలో ఒక సంవత్సరం నిరంతర రైతు మిగతా 7లో

'రాజధాని ఫైల్స్' చిత్ర ప్రదర్శనపై స్టే

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని ఫైల్స్ సినిమాలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి నేతల ప్రతిష్టను దెబ్బతీసే సన్నివేశాలు ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు గురువారం స్టే ఉత్తర్వులిచ్చింది. సినిమా ప్రదర్శనను తాత్కాలికంగా నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. స్టే ఉత్తర్వులు జారీ చేయకపోతే పిటిషనర్లకు పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుందన్న న్యాయవాది వాదనల తర్వాత స్టే ఇచ్చింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. సినిమాకు చెందిన ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీల రికార్డులను శుక్రవారానికి అందజేయాలంది.

ఈ మేరకు సిబిఎఫ్‌సి ప్రాంతీయ అధికారిని, రివైజింగ్ కమిటీ ప్రిసైడింగ్ అధికారికి న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. 'రాజధాని ఫైల్స్' పేరుతో తీసిన సినిమాకు సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేయాలంటూ వైసిపి ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

మారని కేంద్రం తీరు

- చర్చల్లో అదే ప్రతికూల ధోరణి
- సుప్రీంకోర్టులో కేసును సాకుగా చూపుతోంది
- రుణ పరిమితిలో సడలింపు లేదు
- కేరళ ఆర్థిక మంత్రి బాలగోపాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు ఆదేశించిన తరువాత కూడా కేంద్రం తీరు మారలేదు. కేరళపై ఆర్థిక దిగ్బంధనం తొలగించి సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎప్పటిలానే ప్రతికూల వైఖరిని ప్రదర్శించింది. కోర్టు సూచన మేరకు గురువారం నాడిక్కడ జరిగిన చర్చల్లో రాష్ట్రానికి రుణ పరిమితిపై విధించిన కోతను ఎత్తివేసేందుకు కానీ, కేరళకు కేటాయింపులను పునరుద్ధరించేందుకు కానీ ఎలాంటి సుముఖత చూపలేదు. సుప్రీంకోర్టులో కేసు అనేక అంశాలకు అడ్డుగా నిలుస్తోందంటూ చర్చలో కేంద్ర ప్రభుత్వం విచిత్రమైన వైఖరి తీసుకుందని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ చెప్పారు. చర్చల అనంతరం కేరళ హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి కెఎన్ బాలగోపాల్ మాట్లాడుతూ, కేరళను ఇబ్బంది పెట్టాలనే కేంద్ర ప్రభుత్వ ధోరణిలో ఎలాంటి మార్పు లేదని అన్నారు. కాగా కేరళ ప్రభుత్వ పిటిషన్‌పై తదుపరి విచారణ వచ్చే సోమవారం జరగనుంది.

గురువారం కేంద్రంతో జరిగిన చర్చల్లో కేరళ తరపున ఆర్థికశాఖ మంత్రి కెఎన్ బాలగోపాల్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి కెఎం అబ్రహం, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రవీంద్ర కుమార్ అగర్వాల్, అడ్వకేట్ జనరల్ కె గోపాలకృష్ణ కురుప్ పాల్గొనగా, కేంద్రం తరపున ఆర్థికశాఖ కార్యదర్శి టివి సోమనాథన్ నేతృత్వంలోని అధికారుల బృందం హాజరైంది.. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రులు చర్చలకు రాలేదు. కోర్టు ఆదేశాల మేరకు కేంద్రం ఈ విధానాన్ని అవలంభించింది.

కేంద్రంతో జరిపిన చర్చలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదని బాలగోపాల్ అన్నారు. 'అన్ని అంశాలు చర్చకు వచ్చాయి. అయితే, పరిష్కారం దగ్గరకొచ్చేసరికి సుప్రీంకోర్టులో కేసును సాకుగా చూపి కేంద్ర బృందం మిగతా 7లో

సిస్కోలో 4 వేల మందిపై వేటు



న్యూయార్క్ : టెక్ కంపెనీల్లో ఉద్యోగ తొలగింపులు కొనసాగుతూనే వున్నాయి. తాజాగా అమెరికాకు చెందిన ప్రముఖ నెట్‌వర్కింగ్ ఉపకరణాల తయారీ సంస్థ సిస్కో సిస్టమ్స్ ప్రపంచ వ్యాప్తంగా నాలుగు వేల మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. 2023 నాటికి సిస్కోలో 85 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో 5 శాతం మంది ఉద్యోగులను ఇంటికి పంపనున్నట్లు ఆ సంస్థగా పేర్కొంది. కాగా ఫిన్‌టెక్ దిగ్గజ సంస్థ 'పేపాల్' ఈ ఏడాది 9 శాతం మంది ఉద్యోగులపై వేటు వేయాలని ఇటీవలే నిర్ణయించింది. సుమారు 2,500 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. రోబోటిక్ వ్యాక్యుమ్ క్లీనింగ్ సొల్యూషన్స్ అందించే ఐరోబోట్ తన సిబ్బందిలో 31 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఐటి, టెక్ కంపెనీలు జోరుగా కొనసాగుతున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, లింక్డిన్, మెటా తదితర దిగ్గజ సంస్థలు ఇప్పటికే వేలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి.



రేపు జిఎస్‌ఎల్‌వి ఎఫ్ -14 ప్రయోగం

- వాతావరణ మార్పులపై అధ్యయనం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

శ్రీహరి కోట నుంచి ఈనెల 17న సాయంత్రం 5.30 గంటలకు జిఎస్‌ఎల్‌వి ఎఫ్-14 ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. ఈ రాకెట్ ద్వారా భారత వాతావరణ ఉపగ్రహం ఇన్‌శాట్- 3డి ఎస్‌ను ప్రయోగించనున్నారు. వాతావరణ అంచనాలు, విపత్తులను ముందుగా పసిగట్టడానికి ఈ ప్రయోగం చేపట్టనున్నారు. ఎప్పటికప్పుడు వాతావరణంలో జరిగే మార్పులు గమనించి భూ కేంద్రాలకు కచ్చితమైన సమాచారం అందించడానికి కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్సెస్ శాఖ కోసం ఈ ప్రయోగాన్ని జరపనుంది. వాతావరణ సంబంధమైన అంశాలను అధ్యయనం చేసేందుకు ప్రయోగిస్తున్న ఈ ఉపగ్రహం బరువు 2,275 కేజీలు. పిఎస్‌ఎల్‌వి రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జిఎస్‌ఎల్‌విని మూడు దశల్లో ప్రయోగించనున్నారు. 51.7 మీటర్ల పొడవైన జిఎస్‌ఎల్‌వి ఎఫ్-14 రాకెట్ ప్రయోగ సమయంలో 420 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి దూసుకెళ్లనుంది. షార్‌లోని రెండవ వేదిక వద్ద ఇప్పటికే రాకెట్ ప్రయోగానికి సంబంధించి తుది ఏర్పాట్లు జోరందుకున్నాయి. జిఎస్‌ఎల్‌వి మార్కు-2 సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం.

రాజకీయ ప్రకటనలకు ముందస్తు ఆమోదం తప్పనిసరి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే రాజకీయ ప్రకటనలు తప్పనిసరిగా ఎంసిఎంసి కమిటీ ముందస్తు ఆమోదం పొందాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రసారం చేసే ప్రకటనలకు జిల్లా ఎంసిఎంసి కమిటీలు, రాష్ట్ర స్థాయిలో ప్రసారం చేయదలచిన ప్రకటనలకు రాష్ట్ర కమిటీ అనుమతులు వుండాలన్నారు. గురువారం మధ్యాహ్నం రాజకీయ ప్రకటనల విషయంపై ఎంకె మీనా రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముందు రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో కమిటీ నిర్ణయం తీసుకుంటుం దన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా రాజకీయ ప్రకటనలపై ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంసిఎంసి కమిటీ సభ్యులు అడిషనల్ సిఇఒ కోటేశ్వరరావు, దూరదర్శన్ కేంద్రం విజయవాడ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జి కొండలరావు, పిఐబి మీడియా కమ్యూనికేషన్ ఆఫీసర్ టి హెన్రీ రాజ్, సిపిఎం నుంచి వై వెంకటేశ్వరరావు, జయరామ్, వైసిపి నుంచి నాగిరెడ్డి, నారాయణ మూర్తి, టిడిపి నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రాష్ట్రంలో పెట్రేగిపోతున్న ఎర్ర చందనం మాఫియా

- చర్యలు తీసుకోవాలని గవర్నరుకు టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎర్ర చందనం మాఫియా పేట్రేగిపోతుందని, దానిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని టిడిపి నేతలు విమర్శించారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్‌ను రాజ్‌భవన్‌లో ఆ పార్టీ నేతలు బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎర్ర చందనం మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్మగ్లర్లతో సంబంధాలు పెట్టుకుని మాఫియాను ప్రభుత్వమే ప్రేరేపిస్తోందని ఆరోపించారు. స్మగ్లింగ్‌ను అడ్డుకున్న కానిస్టేబుల్ కె గణేష్‌ను సైతం మాఫియా కారుతో గుద్ది చంపారని తెలిపారు. కాగా, ఎన్నికల్లో లబ్ధి పొందడానికి వలంటీర్లను సిఎం జగన్ బలిపశువుల్ని చేస్తున్నారని తెలుగు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత ఒక ప్రకటనలో విమర్శించారు.

'సజ్జల' కుటుంబంపై చర్యలు తీసుకోవాలి

- కేంద్ర ఎన్నికల సంఘానికి అచ్చెన్నాయుడు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబంపై చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి గురువారం లేఖ రాశారు. సజ్జల కుటుంబానికి మంగళగిరి, పొన్నూరు రెండు నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఓటరు జాబితాలోని అవకతవకలకు ఇది ఒక ఉదాహరణ అని తెలిపారు. రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్, సెక్షన్-31 ప్రకారం సజ్జల కుటుంబంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఓట్లు తొలగించకుండా కుమ్మక్కైన ఇఆర్ఒలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాబోయే ఎన్నికల్లో అరాచకాలు సృష్టించే అవకాశం ఉందంటూ మరోలేఖ రాశారు. రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను అడ్డుకోవడం పిరికిపంద చర్య అని అచ్చెన్నాయుడు విమర్శించారు. సామాజిక బాధ్యతతో వాస్తవాలను సినిమాగా తీస్తే తప్పెలా అవుతుందని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మొన్నటి వరకూ మూడు రాజధానులు అన్నారని, ఇప్పుడు ఉమ్మడి రాజధాని అంటున్నారని అన్నారు.

టిడిపి, జనసేన కలిస్తే జగన్ కుర్చీ ఖాళీ

- 'విధ్వంసం' పుస్తకావిష్కరణలో చంద్రబాబు
- జగన్ పాలనంతా విధ్వంసమే : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి-జనసేన కలిస్తే జగన్ కుర్చీ ఖాళీ అవుతుందని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. సీనియర్ జర్నలిస్టు ఆలపాటి సురేష్ కుమార్ రచించిన 'విధ్వంసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడలో గురువారం జరిగింది. ముఖ్య అతిథులుగా చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, విశిష్ట అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు తొలికాపీని పవన్‌కు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. చొక్కాలు మడతపెట్టడానికి సిద్ధం కావాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. టిడిపి-జనసేన కార్యకర్తలు కుర్చీ మడత పెడితే జగన్ కుర్చీ ఖాళీ అవుతుందని అన్నారు. ప్రజల భవిష్యత్తు కోసమే పవన్‌కల్యాణ్‌తో కలిసి పోరాడుతున్నట్లు స్పష్టం చేశారు. తిరగబడతారో, బానిసలుగా ఉండిపోతారో ప్రజలే తేల్చుకోవాలని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో అందరూ బాధితులమే అన్నారు. సంపాదనే ధ్యేయంగా అమరావతి, పోలవరంను జగన్ ధ్వంసం చేయాలని నిర్ణయించుకున్నారని విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మించి ఉంటే ప్రభుత్వానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం వచ్చి ఉండేదని అన్నారు. ఇప్పటి వరకూ మూడు రాజధానులు అన్నారని, మళ్లీ నాలుగో రాజధాని హైదరాబాద్ అంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు సమస్య వస్తే ప్రభుత్వం వద్దకు వెళ్తారని, ప్రభుత్వమే సమస్య అయితే ఏం చేయాలని ప్రశ్నించారు. తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలని తనకు, పవన్‌కల్యాణ్‌కు సంకల్పం ఉందన్నారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. జగన్ పాలనంతా విధ్వంసమే అని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను ప్రభుత్వం తాకట్టుపెట్టిందని పేర్కొన్నారు. త్వరలో వైసిపి పాలన కూలిపోతుందన్నారు. గనుల్లో వేలకోట్లు దోచేసి ఇసుక అడ్డగోలుగా దోచేస్తున్న పాలకులు క్లాస్‌వార్ గురించి మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. 33 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమయ్యారన్న నిజం ముఖ్యమంత్రి ఒప్పుకున్నారని తెలిపారు. జగన్ చేసిన ప్రతి తప్పుకూ బలమైన గుణపాఠం చెబుతామని అన్నారు. విధ్వంసం, విచ్ఛిన్నంతో రాష్ట్రాన్ని తిరోగమన బాటకు కారణమైన జగన్.. ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. కె రామకృష్ణ మాట్లాడుతూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై వైసిపి, టిడిపి ఎంపిలు కేంద్రానికి కనీసం వినతిపత్రం ఇవ్వలేకపోయారని అన్నారు. లిక్కర్ స్కాంపై కేంద్రానికి టిడిపి ఫిర్యాదు చేయలేకపోయిందన్నారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు ఎ శివారెడ్డి, అమరావతి బహుజన జెఎసి అధ్యక్షులు పోతుల బాలకోటయ్య విశిష్ట అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

'విధ్వంసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్, రామకృష్ణ, వేదికపై రచయిత ఆలపాటి సురేష్, బాలకోటయ్య తదితరులు

వివాహ వేడుకకు సిఎం జగన్

ప్రజా సంఘాలకు ముందస్తు నోటీసులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/కార్పొరేషన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం కర్నూలులో పర్యటించారు. కోడుమూరు రోడ్డులోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే కె చెన్నకేశవరెడ్డి మనవడు పవన్ కల్యాణ్ రెడ్డి వివాహానికి హాజరయ్యారు. వధువరులను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుమ్మనూరు జయరాం, ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సిఎం జగన్ కర్నూలుకు వస్తున్న సందర్భంగా పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. ఆవాజ్, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, నాయకులకు ముందస్తుగా నోటీసులు ఇచ్చి ఎక్కడికి పోకూడదని హుకుం జారీ చేశారు. కర్నూలులో ఆవాజ్ నగర కార్యదర్శి ఎస్‌ఎండి షరీఫ్, నగర కమిటీ సభ్యుడు ఇంతియాజ్, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర అధ్యక్షులు అమర్, ఎమ్మిగనూరులో డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, వీరేష్, ఆలూరులో డివైఎఫ్‌ఐ మండల కార్యదర్శి మైన ఉపాధ్యక్షులు గోవర్ధన్, నాయకులు మల్లికార్జున షఫీ, ఆదోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులుకు ముందస్తు నోటీసులు ఇచ్చారు.

విలేకరిపై దాడి చేసిన ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోండి

ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి మండలంలోని న్యూస్‌టుడే కంట్రిబ్యూటర్ విలేకరి పరమేశ్వరరావుపై దాడికి పాల్పడ్డ ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా అధికార పార్టీ అండతో పెట్రేగిపోతోందని విమర్శించారు. అమరావతి మండలంలో కృష్ణానదిలో అక్రమంగా తవ్వుతున్న ఇసుకపై న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన పరమేశ్వరరావుపై భౌతికదాడికి పాల్పడుతూ పెట్రోల్‌తో తగలబెట్టేందుకు ప్రయత్నించడం అరాచకమని తెలిపారు. తక్షణం పరమేశ్వరరావుపై దాడికి పాల్పడ్డవారందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి

పలుచోట్ల మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలపై జిఒలు విడుదల చేయాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు గురువారం రాష్ట్రంలో పలుచోట్ల ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె ముగిసి 35 రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకాలేదని తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోపు ప్రభుత్వం ఇచ్చిన సమ్మె కాలపు హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ధర్నాలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను జిఒ రూపంలో విడుదల చేయకపోవడం శోచయమన్నారు. వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిఒ విడుదల చేసే వరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల ధర్నాకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మద్దతు తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నంద్యాలలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందించారు.

ఇసుకను దోచేస్తున్నారు: పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్యావరణాన్ని పట్టించుకోని వైసిపి నేతలు ఇసుకను దోచేస్తున్నారని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆరోపించారు. వనరులను దోచుకోవడమే వారికి ధ్యాస అని, పాలన మొదలుపెట్టిన తొలి నెలలోనే ఇసుక దోపిడీ కోసం భవన నిర్మాణ కార్మికులను రోడ్డునపడేశారని పేర్కొన్నారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో గురువారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని కేంద్ర ప్రభుత్వం కూడా హైకోర్టుకు తెలిపిందన్నారు.

రైతులపై దాడిని ఖండించండి

- నేటి గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలి
- ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ రంగానికి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచేందుకు చలో ఢిల్లీకి బయలుదేరిన రైతులపై బిజెపి ప్రభుత్వం అమానవీయ పద్ధతిలో దాడులు చేస్తోందని, ఈ అమానవీయ దాడులను తీవ్రంగా ఖండించాలని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కోరింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని రైతు, కార్మిక సంఘాలు శుక్రవారం చేపట్టిన పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరింది. ఈ మేరకు గురువారం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, రైతు సంఘం నాయకులు పి జమలయ్య, జి ఈశ్వరయ్య, డి హరినాథ్, వెంకటరెడ్డి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో విశేష కృషి చేశారని స్వామినాథన్‌కు భారతరత్న అవార్డును ప్రకటించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కోరిన రైతులపై దాడులకు తెగబడుతోందని విమర్శించారు. రైతులపై టియర్ గ్యాస్, చెవులు దెబ్బతినేలా శబ్దాలు, వాటర్ గన్‌లు, రోడ్లపై మేకులు, గుంతలు తవ్వడం వంటి అడ్డంకులు సృష్టించడంతోపాటు లాఠీఛార్జ్ చేస్తూ రైతులను తీవ్రంగా గాయపరుస్తున్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులపై సాగిస్తున్న దాడులను స్వామినాథన్ కూతురు కూడా ఖండించినట్లు తెలిపారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని, కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని, రుణ విమోచన కల్పించాలని, విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలనే డిమాండ్‌లతో పాటు కార్మిక హక్కులను కాలరాసి కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దొంగ ఓట్లతో గెలిచేందుకు యత్నం

- ప్రభుత్వ సలహాదారుకు రెండు చోట్ల ఓటు
- సిఎం మంత్రివర్గానికి చెత్తకేబినెట్‌గా అవార్డు
- శంఖారావం సభల్లో లోకేష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, లావేరు

వచ్చే ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలవాలని వైసిపి చూస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. ప్రభుత్వ సలహాదారు ఏకంగా రెండు చోట్ల ఓటు నమోదు చేసుకున్నారని, వచ్చే ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రలో టిడిపి జోష్ చూసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌కు కరెంట్ షాక్ కొట్టడం ఖాయమన్నారు. శంఖారావం యాత్రలో భాగంగా గురువారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరు, విజయనగరం జిల్లా రాజాం, చీపురుపల్లి నిర్వహించిన సభల్లో ఆయన ప్రసంగించారు.

మూడు కిలోమీటర్లకు ముఖ్యమంత్రి హెలికాప్టర్ వాడుతున్నారని, అధ్వాన రోడ్లతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఆయనకు తెలియడం లేదన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తాను నమ్ముతుంటే, రాజారెడ్డి రాజాంగాన్ని సిఎం నమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. తిరుపతి ఉపఎన్నికలో దొంగ ఓట్లతో గెలిచారని, దొంగ ఓట్లు చేర్పించే అధికారులపై చర్యల తప్పవని తాను ఆ రోజే చెప్పానని గుర్తు చేశారు. తాను జనంలో తిరుగుతుంటే, జగన్ పరదాల చాటున పర్యటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ మంత్రివర్గానికి దేశంలోనే చెత్త కేబినెట్‌గా అవార్డు వచ్చిందన్నారు. ఆర్థికమంత్రి బుగ్గన తెల్లవారితే అప్పుల అప్పారావు మాదిరిగా ఢిల్లీ చుట్టూ తిరుగుతారని, పిల్లలు బాగా చదవకపోవడం వల్లే ఉద్యోగాలు రాలేదన్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పరిశ్రమలు ఎప్పుడు తీసుకువస్తాయంటే కోడి ముందు వచ్చిందా, గుడ్డు వచ్చిందా అనికబుర్లు చెప్పే పరిశ్రమల శాఖ మంత్రి కోడిగుడ్డు అమర్ నాథ్ వంటి ఎంతో అద్భుతమైనవారు జగన్ కేబినెట్‌లో ఉన్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అని బోర్డులు పెట్టించుకుంటున్న జగన్‌ను ఆయన సొంత తల్లి, చెల్లెలే నమ్మడం లేదని విమర్శించారు. టిడిపిపొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లా రాజాం సభలో మాట్లాడుతున్న లోకేష్

ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

- సిపిఎం రాష్ట్ర కమిటీ హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని సిపిఎం రాష్ట్ర కమిటి పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలలో దొంగడబ్బు, నల్లధనం విచ్చలవిడిగా ప్రవహిస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు వారి ప్రయోజనాలను ప్రోత్సాహించే అభ్యర్థులు, రాజకీయపార్టీలకు డబ్బును వెదజల్లుతూ ప్రజాతీర్పును తలకిందులు చేస్తున్నారని తెలిపారు. ఇదే నల్లడబ్బుతో ఓడిపోయిన పార్టీ ప్రతినిధులను కొనుగోలు చేసి ప్రభుత్వాలను సైతం తారుమారు చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ తీర్పు చాలా ప్రత్యేకతను సంతరించుకుందని తెలిపారు. ఎన్నికల బాండ్లకు వ్యతిరేకంగా కోర్టులో సిపిఎం కూడా పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో, ఎన్నికల ఖర్చులో పారదర్శకత ఉండాలని కోరుకునే పార్టీల్లో సిపిఎం ముందు వరసలో వుంటుందని పేర్కొన్నారు. ఈ తీర్పు నేపథ్యంలో ఎన్నికల బాండ్లను పూర్తిగా నిషేధించాలి. ఏ కంపెనీ అయినా, ఏ వ్యక్తైనా ఎవరికి ఎంత డబ్బు ఇస్తున్నాడో, ఆ పార్టీ ఎంత ఖర్చు పెడుతుందో లెక్క ఉంటేనే నల్లధనం ప్రవాహాన్ని అడ్డుకోగలమని తెలిపారు. అధికార పార్టీ ప్రత్యేకించి మోడీ ప్రభుత్వం ప్రత్యర్థి పార్టీలపైకి ఇడి, ఐటి లాంటి సంస్థలను ప్రయోగించి వారి దగ్గరున్న డబ్బును లాక్కోవడం, తమ పార్టీ అభ్యర్థులు పెట్టే ఖర్చులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా వదిలేయడం లాంటివి సర్వసాధారణమయ్యాయని పేర్కొన్నారు. అన్ని పార్టీలకు ఎన్నికల్లో ఖర్చు పెట్టేదానికి ఒకే విధమైన విధివిధానాలు ఉంటే ఎన్నికల సంస్కరణల్లో ఒక ముఖ్యభాగం పూర్తవుతుందని తెలిపారు. ఆ దిశగా సుప్రీంకోర్టు కూడా చొరవ తీసుకుని నియమ నిబంధనలు రూపొందించాలని కోరారు. ఎన్నికల ఖర్చులలో పారదర్శకత లోపించడం వల్ల శత కోటీశ్వరులు చట్టసభల్లో ఎంపీలు, ప్రజా ప్రతినిధులుగా మారి వారికి అనుకూలమైన చట్టాలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రజల ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలలో దొంగడబ్బును అరికట్టగలిగే ఈ తీర్పును సిపిఎం స్వాగతిస్తోందని తెలిపారు.

తీర్పును స్వాగతిస్తున్నాం : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

రాజకీయాలను, ఎన్నికల వ్యవస్థను మొత్తం డబ్బుమయం చేసే ఎన్నికల బాండ్ల ప్రక్రియను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రాత్మకమైన తీర్పును స్వాగతిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారపార్టీలకు ఎన్నికల బాండ్ల ద్వారా నిధుల సేకరణ అంటే ఇష్టారాజ్యంగా క్విడ్ ప్రో చేసుకునే అవకాశం వుందని తెలిపారు. అలాగే రాజకీయ పార్టీలకు వచ్చే నిధులను పారదర్శకంగా వుండాలని ఆర్‌టిఐ పరిధిలోకి తీసుకురావడం కూడా మంచి పరిణామమని తెలిపారు.

విశాఖ 'ఉక్కు'ను పరిరక్షించుకుంటాం

- స్టీల్ ప్లాంట్ ఒబిసి అసోసియేషన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించడమే కాకుండా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని స్టీల్ ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1099వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఒబిసి అసోసియేషన్ నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ త్యాగాలతో ఏర్పడ్డ స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టాలని అనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్న మోడీ సర్కారుకు రానున్న కాలంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. శుక్రవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఉక్కు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.

టిడిపిలోకి పలువురు వైసిపి నేతలు

- చంద్రబాబు సమక్షంలో చేరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలు నియోజకవర్గాలకు చెందిన వైసిపి నేతలు టిడిపి గూటికి చేరారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వారికి పార్టీ కండు వా కప్పి సాదరంగా ఆహ్వానించారు. చంద్రబాబు నివాసం ఉండవల్లిలో గురువారం ఈ చేరికలు జరిగాయి. కర్నూలు, కదిరి, రాయదుర్గం, కోవూరు, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసిపి నేతలు టిడిపిలో చేరారు. నెల్లూరు జిల్లా వైసిపి రైతు విభాగం అధ్యక్షులు సూరా శ్రీనివాసులు రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం జెడ్‌పిటిసి సూరా దీప, కౌన్సిలర్ అందె ప్రత్యూష, అద్దంకి నియోజకవర్గానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి అట్లా చిన్నవెంకట రెడ్డి, సంతమాగులూరు ఎంపిపి ఏనుబర్ల యలమంద, కర్నూలు నియోజక వర్గా నికి చెందిన మైనార్టీ నాయకులు మహమ్మద్ ఖాసీ, వాసవీ పైపుల కంపెనీ అధినేత సత్రశాల జగన్నాథ్ గుప్తా, కదిరి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపిపిలు పుల్ల విజయారెడ్డి, ఆవుల మనోహర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన కాటన్ బోర్డు మాజీసభ్యులు శ్రీని వాస్ రెడ్డి, రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన నీలకంఠా రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి, ఎంపిపి, సర్పంచ్‌లు తదితరులు చంద్రబాబు సమక్షంలో టిడిపి చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, భూమా అఖిల ప్రియ ఉన్నారు. చేరికలతో పాటుపలు నియోజకవర్గాలకు చెందిన టిడిపి ఇన్‌ఛార్జ్‌లు చంద్రబాబును కలిశారు.

22న లావు శ్రీకృష్ణదేవరాయులు ...?

నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు ఈ నెల 22వ తేదీన టిడిపిలో చేరుతున్నట్లు సమాచారం. చంద్రబాబును లావు గురువారం కలిశారు. పార్టీలో చేరికపై చర్చించినట్లు తెలుస్తోంది.

విలేకరిపై దాడిని ఖండించిన చంద్రబాబు

పల్నాడు జిల్లా అమరావతిలో విలేకరి పరమేశ్వరరావుపై జరిగిన దాడిని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఖండించారు. అడ్డగోలు ఇసుక దోపిడీని వెలుగులోకి తేస్తే ప్రాణాలు తీస్తారా? అని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి వైసిపి అక్రమాలను ఎండగడుతున్న మీడియా ప్రతినిధులపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు. పరమేశ్వరరావుపై దాడి చేసిన గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేతకాక.. ఉమ్మడి రాజధాని అడుగుతున్నారా?

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చేతకాని తనానికి ఉమ్మడి రాజధాని మరో రెండేళ్లు కావాలని అడుగుతున్నారా? అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల ఎక్స్ (ట్విట్టర్)లో గురువారం ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారం ఇస్తే విభజన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని తెలిపారు. రాష్ట్రానికి రాజధాని లేదని, ప్రత్యేక హోదా రాలేదని పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీ లేదని, పోలవరం పూర్తి కాలేదని వివరించారు. కనీసం జలయజ్ఞం పెండింగ్ ప్రాజెక్టులకు దిక్కులేదని తెలిపారు. కొత్త పరిశ్రమలు లేవని, ఉన్నవి ఉంటాయో లేదో తెలియదని పేర్కొన్నారు. 8 లక్షల కోట్ల అప్పులు చేసి అప్పులాంధ్రప్రదేశ్ చేశారే తప్ప అభివృద్ధి చూపలేదని వివరించారు. మోడీకి మోకరిల్లి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారే కానీ విభజన హామీలపై ఏనాడూ నోరు విప్పలేదని అన్నారు. ఆంధ్రుల రాజధాని ఎక్కడా? అని అడిగితే పదేళ్ల తర్వాత కూడా హైదరాబాద్ వైపు చూపించే దయనీయ పరిస్థితి అని పేర్కొన్నారు. చంద్రబాబు అమరావతి పేరుతో త్రిడి గ్రాఫిక్స్ చూపిస్తే మూడు రాజధానుల పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. పూటకో మాట, రోజుకో వేషం వేసే వైసిపి నేతల వైఫల్యాలను కప్పిపుచ్చుకునే కుట్రలో భాగమే ఉమ్మడి రాజధాని అంశమని విమర్శించారు. ఓటమి ఖాయమని తెలిసి ప్రజలను కన్ఫ్యూజ్ చేయడం తప్ప వైసిపికి రాజధాని, రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

జగన్ ప్రభుత్వంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు : మాణిక్యం ఠాగూర్

రాష్ట్రంలో పెద్దస్థాయిలో అక్రమ మైనింగ్ జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చినా జగన్ ప్రభుత్వంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బాధ్యులు మాణిక్యం ఠాగూర్ ప్రశ్నించారు. సమావేశంలో ఆ పార్టీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, నాయకులు కొప్పుల రాజు, షేక్ మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

వైసిపిని ఇంటికి పంపండి : నారా భువనేశ్వరి

- శ్రీసత్యసాయి జిల్లాలో 3వ రోజు పర్యటన

ప్రజాశక్తి-గుడిబండ

రాష్ట్రాభివృద్ధిని విస్మరించి, వ్యక్తిగత అజెండాతో ఇతర పార్టీ నేతలను ఇబ్బందులకు గురి చేస్తున్న వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కోరారు. నిజం గెలవాలి పేరుతో చేపట్టిన రాష్ట్ర వ్యాప్తయాత్ర శ్రీసత్యసాయి జిల్లాలో గురువారం మూడో రోజు కొనసాగింది. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో పలు కుటుంబాలను కలిసి వారితో మాట్లాడారు. మడకశిర నియోజకవర్గం గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి చెందిన టిడిపి అభిమాని ముత్తప్ప కుటుంబాన్ని పరామర్శించారు. టిడిపి ఎల్లప్పుడు అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఏ తప్పూ చేయకున్నా వైసిపి ప్రభుత్వం అక్రమ కేసు బనాయించి 52 రోజులు జైలులో పెట్టిందన్నారు. ఆ సమయంలో తమ కుటుంబానికి టిడిపి శ్రేణులు అండగా నిలిచారన్నారు. అలాంటి కుటుంబాలను పరామర్శించాలన్న ఉద్దేశంతో నిజం గెలవాలి పేరుతో రాష్ట్ర వ్యాప్త పర్యనను చేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. నారా భువనేశ్వరి దిన్నేటి గ్రామానికి వెళ్లిన సమయంలో పలువురు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి భువనేశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి, ఎమ్మెల్సీ అనురాధ, మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే శివానందతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి కాలుష్యం నియంత్రణలో సర్కారు వైఫల్యం

- మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షలు, డయేరియా బాధితులకు రూ.25 వేలు చొప్పన పరిహారం ఇవ్వండి : వి శ్రీనివాసరావు
- గుంటూరులోని డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో పర్యటన

డయేరియా బాధితులతో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీటి సరఫరాలో ఏర్పడిన కాలుష్యాన్ని ముందస్తుగా గుర్తించి నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. గుంటూరులోని శారదా కాలనీలో నీటి కాలుష్యం బారినపడిన ప్రజలను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. గత వారం రోజులుగా నీరు కలుషితమై వందలాదిమంది ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, పద్మ అనే మహిళ మృతి చెందారని తెలిపారు. ఆమె మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, పద్మ కుటుంబానినికి రూ.25 లక్షలు, వాంతులు, విరోచనాల వల్ల అస్వస్తతకు గురైన వారికి ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో తాగునీటి పైపులు పాతవి కొనసాగిస్తూ కొత్తవి సరిగా అమర్చకపోవడం వల్ల పాత పైపుల్లో మురుగు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వివరించారు. 80 శాతం వ్యాధులు కేవలం నీటి కాలుష్యం వల్లే వస్తాయని, పరిశుభ్రమైన నీరు అందించకుండా అధికారులు ఇతర కారణాల వల్ల డయేరియా వచ్చిందని అర్థం లేని వాదనలతో కాలయాపన చేయడం తగదని అన్నారు. నవరత్నాలలో తాగునీటి అంశం లేకపోవడం వల్ల ముఖ్యమంత్రి జగన్ గుంటూరులో డయేరియా ప్రబలినా పట్టించుకోలేదని విమర్శించారు. నీరు కలుషితం కావడానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరులో 2018లో కూడా ఇలాగే తాగునీరు కలుషితం వల్ల 25 మంది మృతి చెందారని, వేలాదిమంది అస్వస్తతకు గురయ్యారని గుర్తు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ గుంటూరులో తాగునీటి కలుషితంపై ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేశామని చెప్పారని, కానీ ఇంతవరకు ఆ కమిటీ నివేదిక బహిర్గతం చేయలేదని అన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, స్వచ్ఛమైన తాగునీటిని మాత్రం ప్రభుత్వం ప్రజలకు అందించలేకపోతోందని విమర్శించారు. అమృత్ పథకం ద్వారా 24 గంటలూ నీరు ఇస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయి పరిస్థితులను పట్టించుకోవడం లేదన్నారు. తాగునీరు విషంలా మారుతోందని, నీటి వ్యాపారం పరిపాటిగా మారిందని విమర్శించారు. ఆస్తి పన్ను పెంపు, చెత్త పన్ను విధింపు ద్వారా ప్రజలపై భారం మోపిన ప్రభుత్వం స్వచ్ఛమైన తాగునీరు, మౌలిక వసతులపై దృష్టి సారించడం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్, ఆవాజ్ రాష్ట్ర నాయకులు ఎంఎ.చిష్టీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను ఉచితంగా సరఫరా చేయండి

రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నదీ తీర ప్రాంతంలో ఇసుక మాఫియాలు పెట్రేగిపోతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను నిరోధించడం లేదన్నారు. ఇసుకను ప్రివిలేజ్ సరుకుగా భావించి ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని విమర్శించారు.

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సురవరం సుధాకర్ రెడ్డి

ఎన్నికల కోసమే భారతరత్న అవార్డులు

- రాష్టంలో వైసిపి, టిడిపి ఆర్థిక విధానాల్లో తేడా లేదు
- దేశ రక్షణకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం
- ఆత్మీయ సమ్మేళనంలో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఎన్నికల్లో గెలవడం కోసమే బిజెపి భారతరత్న అవార్డులు ప్రకటించిందని సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ఉమ్మడి జిల్లా ఆత్మీయ సమ్మేళనాన్ని సిపిఐ రాష్ట్ర నాయకులు సి.రామచంద్రయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. సురవరం సుధాకర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి విజయలక్ష్మి, చిన్న కుమారుడు కపిల్ సురవరం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సామ్రాజ్యావాదం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిందని, దీంతో పేదలకు తాగడానికి నీళ్ళ, తినడానికి తిండి లేవని తెలిపారు. విలాసవంతమైన భవనాలు, ఆస్తులు పెరగడం వల్ల దేశం అభివృద్ధి చెందదని, ఇలాగే చేస్తూ వెళ్తే కొన్ని రోజులకు బహుళ అంతస్తులు, భవనాలు మాత్రమే మిగులుతాయని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలు, ఎర్రజెండా మాత్రమే పీడిత ప్రజలకు, దేశానికి రక్షణ ఇవ్వగలవన్నారు. కమ్యూనిస్టు పార్టీలు నిజమైన ప్రత్యామ్నాయ విధానాలని, ప్రజల పోరాటాలకు తమ వంతు కృషిగా ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో వైసిపి, టిడిపి ఆర్థిక విధానాలు ఒక్కటేనని, ఎవరి స్వార్థ రాజకీయాలు వారికి ఉన్నాయని, బిజెపితో అంటకాగుతున్నాయని విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్ దేశయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవి.నారాయణ, పిఎస్.రాధాకృష్ణ, సురవరం సుధాకర్ రెడ్డి, విజయలక్ష్మి దంపతులను శాలువా, పులమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, మనోహర్ మాణిక్యం, రసూల్, రామకృష్ణా రెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, సిపిఐ, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ

- 27 మందికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్ (ఏలూరు జిల్లా)

ఆర్‌టిసి బస్సును లారీ ఢీకొన్న ఘటనలో 27 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం వద్ద జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుట్టాయగూడెం మండలం దొరమామిడి గ్రామం నుండి జంగారెడ్డిగూడేనికి 57 మంది ప్రయాణికులతో ఆర్‌టిసి బస్సు బయలుదేరింది. జంగారెడ్డిగూడెం శివార్లలో జాతీయ రహదారిని దాటుతుండగా అశ్వారావుపేట వైపు నుంచి రాజమండ్రి వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ.. బస్సును ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 27 మందికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పరామర్శించారు. సిఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పోటీ పరీక్షల్లో సమయస్ఫూర్తి ఉండాలి

- ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు సమయస్ఫూర్తి ఉండాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని త్యాగరాజ భవనంలో గ్రూప్, డివైఇఒ పరీక్షలపై ఉచిత అవగాహనా సదస్సును డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో భారత సమాజం పుస్తకాన్ని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర రావు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల సామాజిక, ఆర్థిక చరిత్ర పుస్తకాన్ని రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీవాణి ఆవిష్కరించారు. ముఖ్యవక్తగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధతపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. పోటీ పరీక్షల్లో ప్రతి మార్కూ ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రశ్నల సరళిపై అవగాహనతోపాటు సమయస్ఫూర్తి ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో సుమారు లక్ష ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు.కేవలం అతికొద్ది పోస్టులు ప్రకటించడం దారుణమన్నారు. 40 ఏళ్ల చరిత్రలో ఐదేళ్లలో ఒకసారి మాత్రమే డిఎస్‌సి ప్రకటించడం ఇదే మొదటిసారని విమర్శించారు. సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, రిటైర్డ్ ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు, సిఐటియు, జెవివి, యుటిఎఫ్, కెవిపిఎస్, నాయకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

కొనసాగిన సిహెచ్‌డబ్ల్యు రిలే దీక్షలు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, యూనిఫాం, మెడికల్ కిట్లు, టిఎ, డిఎ, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యులు) చేపట్టిన సామూహిక రిలే దీక్షలు గురువారం రెండో రోజుకు చేరాయి. అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ కార్యాలయం ఎదుట దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో ఉన్న 36 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా వర్కర్లుగా గుర్తింపబడని 687 మంది సిహెచ్‌డబ్ల్యులు ఉన్నారని, ఆశా వర్కర్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ రూ.నాలుగు వేలు మాత్రమే వేతనం చెల్లించడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రూ.పది వేలు వేతనం ఇవ్వాలని, యూనిఫారం, సెల్‌ఫోన్లు, మెడికల్ కిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలకు సిఐటియు అల్లూరి జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, ఎపి ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ మద్దతు తెలిపారు. దీక్షల్లో చింతపల్లి, కొయ్యూరు, జికె.వీధి, పాడేరు, హుకుంపేట మండలాల నుంచి వచ్చిన సిహెచ్‌డబ్ల్యులు కూర్చున్నారు. పార్వతీపురం ఐటిడిఎ ఎదుట చేపట్టిన దీక్షలనుద్దేశించి శ్రామిక మహిళా సంఘం కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.ఇందిర మాట్లాడారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేక కొండలపై నివసిస్తున్న గిరిజన మహిళలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న వీరిని ఆశాలుగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, 21 నెలలు వేతన బకాయిలు చెల్లిస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదని గుర్తు చేశారు. సీతంపేట ఐటిడిఎ వద్ద దీక్షలు కొనసాగాయి.

సీతంపేట ఐటిడిఎ ఎదుట చేపట్టిన దీక్షలో కూర్చున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

వీసా, మాస్టర్ కార్డ్‌లపై ఆర్‌బిఐ కొరడా

- చెల్లింపులు నిలిపివేయాలని ఆదేశాలు

ముంబయి : నిబంధనలు ఉల్లఘింస్తున్న విత్త సేవల సంస్థలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొరడా ఝుళిపిస్తుంది. ఇప్పటికే మనీలాండరింగ్‌పై ఆరోపణలు ఎదుర్కొంటున్న పేటియంపై కఠిన చర్యలు తీసుకోగా.. తాజాగా వీసా, మాస్టర్‌కార్డ్‌కు షాక్ ఇచ్చింది. ప్రముఖ చెల్లింపు గేట్‌వే సంస్థలైన వీసా, మాస్టర్‌కార్డ్ కమర్షియల్ కార్డులను ఉపయోగించి చెల్లింపులు చేయకుండా చర్యలు చేపట్టింది. కాగా.. ఎందుకు నిషేధం విధించారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే కెవైసి లేని వ్యాపారులకు ఆయా కార్డుల ద్వారా చెల్లింపులు జరుగుతున్నట్లుగా ఆర్‌బిఐ గుర్తించింది. కార్డ్ నెట్‌వర్క్‌లు ఆమోదం లేకుండా పని చేస్తున్నాయని సమాచారం. ఫిన్‌టెక్‌లు, కార్డ్ నెట్‌వర్క్‌లు వ్యాపార విక్రేతలకు కార్డ్ చెల్లింపులు చేసే ప్రక్రియను సష్టం చేసే వరకు కార్డ్ చెల్లింపులు ఉపయోగించకూడదని ఆర్‌బిఐ వర్గాల సమాచారం. వాస్తవానికి క్రెడ్, పేటియం, నోబ్రోకర్ తదితర యాప్‌లు వినియోగదారులు కార్డుల ద్వారా చెల్లింపులు చేసేందుకు అనుమతిస్తుంటాయి. ఈ రంగంలో కార్డు చెల్లింపులు సాధారణంగా ఉపయోగించడానికి అవకాశం ఉండదని సమాచారం. కమర్షియల్ కార్డుల ద్వారా చెల్లింపులను నిలిపివేయాలని ఆర్‌బిఐ ఆదేశాలు ఇచ్చిందని ఓ ఫిన్‌టెక్ ప్రతినిధి తెలిపారు. దీంతో ప్రధానంగా ఇకపై కార్డుల ద్వారా చేసే ఇంటి అద్దెలు, ట్యూషన్ ఫీజుల చెల్లింపులు నిలిచిపోయే అవకాశం ఉందని తెలుస్తోంది.

పబ్లిక్ నోటీసు

సాధారణ ప్రజల దృష్టికి తీసుకొని రావడమేమనగా **లిబరేషన్ కాంగ్రెస్** పేరుతో రాజకీయ పార్టీని రిజిష్టర్ చేయాలని ప్రతిపాదించడం జరిగింది. పార్టీ కార్యాలయం ఆంధ్ర ప్రదేశ్, గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, గుండిమెడ గ్రామం, ప్రాతూరులో ఉంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29A ప్రకారం రాజకీయ పార్టీగా నమోదు చేసుకోవడానికి పార్టీ, భారత ఎన్నికల సంఘం, న్యూఢిల్లీకి దరఖాస్తును సమర్పించింది. సదరు పార్టీ ఆఫీస్ బేరర్ల పేర్లు / చిరునామాలు క్రింది విధంగా ఉన్నాయి.

జాతీయ అధ్యక్షులు: విజయ్ కుమార్ జి యస్ ఆర్ కె ఆర్ -ఫ్లాట్ నం:505, ఎఫ్-బ్లాక్, వజ్ర రెసిడెన్సీ, మణిపాల్ హాస్పిటల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

ప్రధాన కార్యదర్శి: ఐజయ్య కుమార్ దండే, చెట్టున్నపాడు గ్రామం, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్

కోశాధికారి: వెంకటేశ్వర రావు జల్లా, 61-13-2, కృష్ణవేణి రోడ్డు, రామలింగేశ్వర నగర్, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్.

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా అభ్యంతరం ఉంటే, వారు తమ అభ్యంతరాలకు గల కారణాలతో, కార్యదర్శి (రాజకీయ పార్టీ), భారత ఎన్నికల సంఘం, నిర్వాచన్ సదన్, అశోకా రోడ్, న్యూఢిల్లీ-110001 గారికి ఈ నోటీసు ప్రచురించిన 30 రోజులలోపు పంపవచ్చు

పేటియం ఎగ్జిక్యూటివ్‌లను విచారించిన ఇడి

- పలు పత్రాల స్వాధీనం
- మరో 5 శాతం షేర్ పతనం

న్యూఢిల్లీ : మనీలాండరింగ్, ఆర్థిక అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న పేటియం మాతృసంస్థ అయినా వన్97 కమ్యూనికేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు విచారించారని సమాచారం. ఆ సంస్థపై ఆర్‌బిఐ ఆంక్షల నేపథ్యంలో వారి నుంచి కొన్ని పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల ఆర్‌బిఐ ఆంక్షల నేపథ్యంలో పేటియంపై విచారణ చేయాలా వద్దా అనే దానిపై.. ఈ పత్రాలను పరిశీలించి ఇడి నిర్ణయం తీసుకోనుంది. ఫెమా చట్టంలోని నిబంధనలను ఏమైనా ఉల్లంఘించారేమో అని ఆరా తీస్తున్నట్లు ఓ అధికారి పేర్కొన్నారు. ఇడి అధికారులు కోరిన సమాచారం, పత్రాలను పేటియం ఇప్పటికే అందించినట్లు తెలుస్తోంది. వచ్చే వారంలోగా మరిన్ని వివరాలు అందజేయాలని ఇది ఆదేశించినట్లుగా సమాచారం. కాగా పేటియంపై చర్యల నేపథ్యంలో ఆర్‌బిఐ వద్ద ఉన్న సమాచారాన్ని ఇప్పటికే ఇడి, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్‌ఐయు) కోరాయి. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ ఫిబ్రవరి 29 నుంచి డిపాజిట్లను స్వీకరించొద్దని ఆర్‌బిఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

రూ.27వేల కోట్ల సంపద ఆవిరి..

పేటియంపై ఆర్‌బిఐ చర్యల నేపథ్యంలో ఆ సంస్థ షేర్ వరుసగా పడిపోతోంది. గురువారం మరో 5 శాతం క్షీణించి రూ.325.30 ఆల్‌టైం కనిష్ట స్థాయి వద్ద ముగిసింది. పేటియంపై అవకతవకల ఆరోపణలపై ఇడి విచారణకు దిగిందనే వార్తలు ఆ కంపెనీ షేర్‌ను మరింత ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ఆర్‌బిఐ ఆంక్షలు విధించినప్పటి నుంచి 11 రోజులలో పేటియం ఇన్వెస్టర్లు సుమారు రూ.27 వేల కోట్ల సంపదను నష్టపోయారు. 2023 అక్టోబర్‌లో ఆల్ టైం గరిష్ట స్థాయి రూ.998 వద్ద నమోదయిన విలువతో పోల్చితే గురువారం నాటికి 66 శాతం పైగా పతనమైంది. కాగా లిస్టింగ్ సమయంలో దాదాపు రూ.1800 పైగా పెట్టి కొనుగోలు చేసిన ఈ స్టాక్స్ మదుపర్లు ఇప్పుడు లబోదిబోమంటున్నారు.

కెనరా హెచ్‌ఎస్‌బిసి లైఫ్ ఇన్సూరెన్స్ కొత్త ప్లాన్

న్యూఢిల్లీ : కెనరా హెచ్‌ఎస్‌బిసి లైఫ్ ఇన్సూరెన్స్ ఐసెలెక్ట్ గ్యారెంటీడ్ ఫ్యూచర్ ప్లస్ ప్లాన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇది జీవిత బీమా, సురక్షిత లక్ష్యాలకు హామీ ప్రయోజనాలను అందిస్తుందని పేర్కొంది. అనిశ్చిత సమయాల్లో ఆర్థిక భద్రతను అందిస్తుందని, 100 శాతం హామీ ప్రయోజనాలతో, ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో ఈ ప్లాన్ హామీ ఇస్తుందని ఆ సంస్థ పేర్కొంది.

ఇన్సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016 కింద ఇ-వేలం విక్రయ నోటీసు
న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)

వేలం తేదీ & సమయం: మంగళవారం, 19 మార్చి, 2024 ఉ.11 నుండి మ.1 గంటల వరకు

గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ వారు ఇన్సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016లోని సెక్షన్ 33 కింద సెప్టెంబర్ 12, 2023 నాటి ఉత్తర్వు ఆధారంగా **మెసర్స్ న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్** యొక్క లిక్విడేషన్ కోసం ఆదేశించినట్లు నోటీసు ఇవ్వబడింది మరియు శ్రీ.రామకృష్ణన్ సదాశివన్‌ను కార్పొరేట్ రుణదాత యొక్క లిక్విడేటర్‌గా నియమించింది. ఈ నోటీసు లిక్విడేటర్ నిర్వహించిన వేలం విక్రయానికి సంబంధించినది.

దయచేసి గమనించండి: ఇ-వేలం ద్వారా ఆస్తుల విక్రయం ఖచ్చితంగా **"ఎక్కడ ఎలా ఉన్నది మరియు అక్కడ అలాగే" మరియు రికోర్స్ లేకుండా" ప్రతిపాదికన** నిర్వహించబడుతుంది.

తదుపరి, ఈ-వేలం యొక్క వివరణాత్మక నియమ& నిబంధనలు & ఆన్‌లైన్ వేలం విక్రయం యొక్క ఇతర వివరాలను కలిగిఉన్న వేలం ప్రక్రియ మెమోరాండం వెబ్‌సైట్: https://nbid.nesl.co.in/app/loginలో అందుబాటులో ఉన్నాయి లేదా దిగువ పేర్కొన్న ఇమెయిల్ అడ్రస్‌లో లిక్విడేటర్‌ను సంప్రదించవచ్చు. తదుపరి వివరణల కోసం, సంబంధిత పార్టీలు లిక్విడేటర్‌ను ఇక్కడ సంప్రదించవచ్చు: ఇ-మెయిల్ ఐడి: nucleussatellitecomm @gmail.com (లేదా) **sadasivanr@gmail.com**

వేలం వేయబడుతున్న ఆస్తుల షెడ్యూల్:

లాట్ నెం.	ఆస్తి	రిజర్వ్ ధర (రూ)	ధరావత్తు (రూ.)	బిడ్ పెంపుదల (రూ.)
ఎ)	**కార్పొరేట్ రుణగ్రహీత యొక్క విక్రయం-గోయింగ్-కన్సర్న్‌గా మెసర్స్ న్యూక్లియస్ ఎ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్** **గమనిక:** ఫిక్స్‌డ్ డిపాజిట్లు, నగదు & బ్యాంక్ బ్యాలెన్స్‌లు మరియు ప్రభుత్వ సంస్థలు మరియు/లేదా ఇతర చట్టబద్ధమైన అథారిటీల నుండి స్వీకరించాల్సిన ఏవైనా రిఫండ్స్/ఇన్సెంటివ్స్ మరియు ఏదైనా వ్యాజ్యాల నుండి వచ్చే ఆదాయాలు విక్రయించబడుతున్న ఆస్తుల నుండి మినహాయించబడతాయి.	22,53,00,000	2,25,00,000	5,00,000
బి)	**లీజు భూమి &ఫ్యాక్టరీ బిల్డింగ్ మరియు ప్లాంట్ & మెషినరీ మరియు ఇన్వెంటరీ యొక్క స్థిరమైన ఆస్తుల విక్రయం**	22,53,00,000	2,25,00,000	5,00,000
సి)	**ప్లాంట్ & మెషినరీ మరియు ఇన్వెంటరీ**	5,90,00,000	59,00,000	2,00,000
డి)	**లీజు భూమి &ఫ్యాక్టరీ భవనం యొక్క స్థిరమైన ఆస్తుల విక్రయం**	16,63,00,000	1,66,00,000	5,00,000

* రిజర్వ్ ధరకు అదనంగా వర్తించే జిఎస్టీ వసూలు చేయబడుతుంది.

గమనిక:
1) శ్రీసిటీ, ప్లాట్ నెం 465, సిట్రస్ డ్రైవ్, మోపురుపల్లి, వరదయ్యాపాలెం (ఎం), చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-517541లోని అన్ని ఆస్తులు వేలం వేయబడుతున్నవి.
2) ప్రాధాన్యత క్రమం 1) టాట్‌ఏ, 2) లాట్ బి, 3) లాట్ సి మరియు 4) లాట్ డి.

వేలం సమయాలు:

క్ర.సం.	ఈవెంట్ వివరణ	తేదీ
1	వేలం ప్రకటన జారీ	ఫిబ్రవరి 16, 2024న
2	కాబోయే బిడ్డర్ ద్వారా 29ఏ అర్హత అండర్‌టేకింగ్ మరియు కెవైసి పత్రాల సమర్పణ.	16 ఫిబ్రవరి, 2024 నుండి 4 మార్చి, 2024 వరకు.
3	అర్హత కలిగిన బిడ్డర్ యొక్క ప్రకటన (సమర్పించబడిన అర్హత పత్రాల ఆధారంగా)	6 మార్చి 2024న లేదా అంతకు ముందు.
4	వేలం కింద ఉన్న ఆస్తులను తనిఖీ చేయడానికి అర్హత పొందిన బిడ్డర్‌లకు సమయం.	7 మార్చి 2024 నుండి 13 మార్చి 2024 వరకు (ఉ.10 నుండి సా.5 గంటల వరకు లిక్విడేటర్ ముందస్తు అనుమతితో)
5	అర్హత కలిగిన బిడ్డర్లు ఈఎండిని సమర్పించడానికి చివరి	తేదీ 15 మార్చి 2024
6	ఇ-వేలం తేదీ	19 మార్చి 2024

తేదీ: 16 ఫిబ్రవరి, 2024.
ప్రదేశం: చెన్నై.

సం/-
రామకృష్ణన్ సదాశివన్
IBBVIPA-001/IP-P00108/2017-18/10215
లిక్విడేటర్ -న్యూక్లియస్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ (మద్రాస్) ప్రైవేట్ లిమిటెడ్
రిజిస్టర్డ్ మెయిల్: sadasivanr@gmail.com
కరస్పాండెన్స్ మెయిల్: nucleussatellietcomm@gmail.com
చిరునామా: పాత నెం.22, కొత్త నెం.28, మెనోడ్ స్ట్రీట్, పురసవల్కం, చెన్నై-600 007. **మొబైల్ నెం.**94444 55982

వివాహిత దారుణ హత్య

- వివస్త్రను చేసి, గొంతు కోసి హతమార్చిన వైనం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో వివాహిత దారుణ హత్యకు గురయ్యారు. వివస్త్రను చేసి గొంతుకోసి హతమార్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. టూటౌన్ సిఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని గంగానమ్మపేట భవనంవారి వీధికి చెందిన రామిశెట్టి రమేష్, అలేఖ్య దంపతులు. గురువారం తెల్లవారుజామున అలేఖ్య (35) హత్యకు గురయ్యారు. భార్య రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉండడాన్ని గమనించిన భర్త..వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. తెనాలికి చెందిన అన్నం శ్రీనివాస్ కొంతకాలంగా తన భార్యను వేధిస్తున్నాడని, గతంలో కూడా గొడవలు జరిగాయని, కేసు విచారణలో ఉందని పోలీసులకు రమేష్ వెల్లడించారు. అతడే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటాడని ఆరోపించారు. అలేఖ్యను శ్రీనివాసే హత్య చేశాడా? మరెవరైనా ఈ ఘాతుకానికి పాల్పడ్డారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నామని, నిందితులను గాలించేందుకు దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశామని సిఐ తెలిపారు.

మత్స్య సంపద వృద్ధికి జాతీయ దృక్పథం అవసరం

- కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మత్స్య సంపద వృద్ధికి జాతీయ దృక్పథం అవసరమని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పర్షోత్తం రూపాల అన్నారు. విశాఖలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో నీతి ఆయోగ్, మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యాన లోతట్టు రాష్ట్రాల మత్స్య సంపద వినియోగంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ మత్స్య సంపద, పాడి, పశు సంవర్ధక పరిశ్రమ భారతదేశ పురోగతికి ఎంతగానో తోడ్పడతాయన్నారు. పశు, చేపల మేత కోసం ఎగుమతి, దిగుమతి విధానం, దేశంలో రిజర్వాయర్‌లు, నీటి వనరులను లీజుకు తీసుకునే విధానం, సంప్రదాయ మత్స్యకారుల వృత్తి రక్షణ, మార్కెట్ల అప్‌గ్రేడేషన్, నైపుణ్యం వంటి విషయాలపై తాజా వర్క్‌షాప్ రెండు రోజులపాటు జరుగుతుందని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధి, స్థిరమైన ఫిషింగ్ పద్ధతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కీలక వాటాదారులు, పరిశోధన సంస్థలన్నింటినీ ఒకేచోటకు చేర్చి సుస్థిర మార్కెట్ అనుసంధానంలో ఉండే సవాళ్లను అధిగమించేందుకు కార్యాచరణ రూపొందించనున్నామని చెప్పారు. దేశంలో సముద్ర చేపల పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీనియర్ సలహాదారు డాక్టర్ నీలం పటేల్, ఎపి స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ కో వైస్ చైర్మన్ వి.రఘురాం, రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు పాల్గొన్నారు.

1589 మంది వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ఎడిఐపి పథకం కింద విశాఖలోని కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక అధికారిత శిబిర్ పేరుతో 1589 మంది వికలాంగులకు రూ.2.25 కోట్లతో 2,925 పరికరాలను అందజేశారు. అనంతరం గ్రాండ్ బే హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం ప్రయోజనాలను వివరించారు. రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం ద్వారా వయోవృద్ధుల జీవితాల్లో సంతోషాలను నింపేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

సంపాదకీయం

చెంపపెట్టు

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, వాటి జారీని తక్షణం నిలిపివేయాలని బ్యాంకులను ఆదేశిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు మోడీ ప్రభుత్వానికి, బిజెపికి చెంపపెట్టు. కార్పొరేట్లకు దోచిపెట్టి అందుకు ప్రతిఫలంగా వారి నుంచి భారీగా నిధులు సమకూర్చుకొని రాజకీయాలను శాసించాలనుకున్న బిజెపికి సుప్రీం తీర్పుతో కొంతైనా అడ్డుకట్ట పడుతుంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, నిష్కళంక, పారదర్శక రాజకీయాలు కోరుకునే ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిన తీర్పిది. పాలక పార్టీ, కార్పొరేట్ల నడుమ 'నీకిది నాకిది' తరహాలో క్విడ్‌ప్రోకోకు ఎలక్టోరల్ బాండ్ల స్కీం దారి తీస్తుందన్నవారి ఆందోళనలను, వాదనలను సుప్రీం సమర్ధించింది. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్లు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఎటువంటి వివరాలూ తెలియని ఎన్నికల బాండ్లను స్వీకరించడమంటే సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించడమేనంది. నల్లధనాన్ని అరికట్టేందుకు, పారదర్శకత కోసం ఈ స్కీం తెచ్చామన్న బిజెపి ప్రభుత్వ కుతర్కాన్ని తోసిపారేసింది. రాజకీయ పార్టీలకు రహస్యంగా అపరిమిత విరాళాలకు అనుమతిస్తూ కంపెనీల చట్టంలో చేసిన సవరణ ఏకపక్షమనీ తప్పుబట్టింది. బాండ్ల ద్వారా సేకరించే విరాళాల వివరాలను బహిర్గతం చేయాల్సిందేనని సుప్రీం నొక్కి వక్కాణించింది. ఇప్పటి వరకు జారీ చేసిన బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మార్చి 6 లోగా కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలని, ఆ వివరాలను 13 లోగా వెబ్‌సైట్‌లో ఇ.సి ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది.

ఆర్‌టిఐ, ఐ.టి చట్టాలకు విరుద్ధంగా, కంపెనీల చట్టంలో ఏకపక్ష సవరణలతో ఎన్నికల బాండ్ల పథకాన్ని మోడీ సర్కారు ఎందుకు తీసుకొచ్చిందో ఈ కాలంలో బిజెపి జేబులోకి చేరిన అజ్ఞాత కార్పొరేట్ల విరాళాల వరదే చెబుతుంది. 2018 జనవరి నుంచి స్కీంను అమల్లోకి తెచ్చారు. ఎన్నికల బాండ్ అంటే ఒక విధంగా ప్రాంసరీ నోటు వంటిది. నిర్దిష్ట సమయాల్లో వాటిని బ్యాంకులు జారీ చేస్తాయి. బాండ్లను వ్యక్తులు, కంపెనీలు కొనుగోలు చేసి తమకు నచ్చిన రాజకీయపార్టీలకు విరాళంగా అందిస్తాయి. వాటిని పార్టీలు నగదుగా మార్చుకొని ఎన్నికలకు, పార్టీ కార్యకలాపాలకు ఉపయోగపెట్టుకుంటాయి. అయితే ఎవరు విరాళాలిచ్చారో బహిర్గతపర్చనవసరం లేదు. 2017-18 నుంచి 2022-23 వరకు దాదాపు 30 తడవల్లో 28 వేల బాండ్లను ఎస్‌బిఐ జారీ చేసింది. వాటి విలువ రూ.16,500 కోట్లకు పైమాటే. వాటిలో రూ.6,500 కోట్లు బిజెపి గల్లాపెట్టెలో పడ్డాయి. 2018-19, 2019-20లలో 70-80 శాతం విరాళాలు బిజెపి ఖాతాకు చేరాయంటే, కార్పొరేట్లకు ఆ పార్టీకి మధ్య పెనవేసుకున్న మైత్రి బంధం తీవ్రత అవగతమవుతుంది.

ఎలక్టోరల్ బాండ్లు రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేసేందుకేనని పర్యవసానాలబట్టి తెలుస్తోంది. ఎన్నికల నిధి సేకరణలో పెద్ద ఎత్తున గోప్యతతో కూడిన, పారదర్శకత లేని పద్ధతులకు బిజెపి ప్రభుత్వం తెరతీసిందని స్కీం వచ్చినప్పుడే సిపిఎం, పలు ప్రతిపక్ష పార్టీలు, ఎ.డి.ఆర్ వంటి సంస్థలు నిరసించాయి. సుప్రీం కోర్టులో సవాల్ చేశాయి. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట బాండ్ల జారీ ప్రారంభానికి లోపే విచారణ పూర్తి చేయాలని విన్నవించిన మీదట కోర్టు గతేడాది అక్టోబర్‌లో విచారణ ముగించి తీర్పు రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువరించింది. కార్పొరేట్లు అందించిన రాజకీయ నిధులకు బదులుగా రాయితీలు కట్టబెట్టడం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం. ఇది ఆశ్రిత పెట్టుబడిదారీ లక్షణం. తొమ్మిదిన్నరేళ్లలో కార్పొరేట్లు బ్యాంకుల్లో తీసుకున్న రూ.14 లక్షల కోట్ల రుణాలను మోడీ సర్కారు రద్దు చేసింది. కార్పొరేట్ పన్నులో రూ.లక్షల కోట్ల సబ్సిడీలిచ్చింది. సహజ వనరులను, ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా అప్పగించింది. స్వేచ్ఛాయుతమైన న్యాయబద్ధమైన ఎన్నికలకు హామీ కల్పించే విధంగా అభ్యర్థులందరూ సమాన స్థాయిలో పోటీ పడాలనే సూత్రాన్ని ఈ విధంగా లభించిన ధనబలంతో బిజెపి వమ్ము చేస్తోంది. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఎన్నికల సంస్కరణలు అవశ్యమన్న డిమాండ్ బలంగా ముందుకొస్తోంది. ఎన్నికల సంస్కరణలే ప్రజాస్వామ్యానికి రక్ష.

మహనీయుల మాట

ప్రజలంతా రాజకీయంగా చైతన్యవంతులై వుండాలనీ... ఐక్యంగా దోపిడీ వర్గాల ప్రభావాల నుంచి దూరంగా, వెనకబాటుతనానికీ దూరంగా వుండాలని కొందరు భావిస్తారు. కాని ప్రజలంతా అలా వుంటే ఇంక విప్లవం సాధించడంలో కష్టమేముంటుంది?

- లీషావ్‌చీ

ఢిల్లీ దీక్ష ఓ పెద్ద సందేశం

విశ్లేషణ

ఎం.వి. గోవిందన్

ఎల్‌డిఎఫ్ అధికారంలో ఉన్న కేరళపై ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ఆర్థిక దురాక్రమణకు వ్యతిరేకంగా ఈ నెల 8న ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమం దేశ దృష్టిని ఆకర్షించింది. పన్ను కేటాయింపులను నిరాకరిస్తూ, గ్రాంట్లు నిలిపివేసి, రుణ పరిమితిని తగ్గించేసి బిజెపి యేతర రాష్ట్రాలను ఆర్థికంగా కుంగదీస్తున్న కేంద్రానికి వ్యతిరేకంగా దేశ రాజధాని నగరంలో దీక్ష చేపట్టాలనే ఆలోచన మొదటగా కేరళ ప్రభుత్వమే చేసింది. ఒక రాష్ట్ర ప్రభుత్వం రాజధానికి వచ్చి కేంద్రంపై నిరసన తెలపడం అరుదైన ఘటన. స్వతంత్ర భారత చరిత్రలో కేవలం కొన్ని సందర్భాల్లో మాత్రమే ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి కేంద్రంపై నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రికి, ఆర్థిక మంత్రికి లేఖలు రాయడం, ప్రభుత్వ కమిటీలు, ఫోరమ్‌లలో లేవనెత్తడం, ఆర్థిక నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపడం వంటి ప్రజాస్వామిక మార్గాలన్నీ విఫలమైనప్పుడు ఢిల్లీలో సమ్మె చేస్తున్నట్లు కేరళ ప్రకటించింది. ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు కూడా సమ్మె నిర్వహించాల్సి వచ్చిన పరిస్థితి గురించి ప్రజలకు తెలియ చెప్తున్నారు.

పైన పేర్కొన్న అన్ని సందర్భాలలోనూ కేరళ ఉమ్మడి ప్రయోజనాలను పరిరక్షించడానికి, హక్కులను డిమాండ్ చేయడానికి ప్రతిపక్షాల సహకారం కోరింది. అయితే కాంగ్రెస్‌గానీ యుడిఎఫ్ గానీ నవ కేరళ సమావేశంలో లేదా ఢిల్లీ దీక్షలో పాల్గొనడానికి సిద్ధంగా లేవు. ఆర్థిక నిర్వహణ లోపం, పట్టు లేకపోవడమే కేరళ సంక్షోభానికి కారణమన్న మోడీ ప్రభుత్వ వాదనను కేరళలోని కాంగ్రెస్, యుడిఎఫ్ అంగీకరించాయి. అయితే కేరళ దీక్షకు ముందు రోజు ఢిల్లీలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు, ప్రజాప్రతినిధులు కేంద్ర నిర్లక్ష్యానికి నిరసనగా ధర్నా చేయడంతో యుడిఎఫ్ వాదనలు తుస్సుమన్నాయి. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ 'కర్ణాటక తరహాలోనే కేరళ కూడా ఇబ్బంది పడుతోంది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కేంద్రం చేసిన ఆర్థిక అన్యాయంపై మొన్ననే మాట్లాడారు. కేంద్రం నిర్లక్ష్యం వాస్తవమేనని వారంతా అంగీకరించాల్సి వచ్చింది' అన్నారు.

మోడీ ప్రభుత్వ పదేళ్ల పాలనపై 'బ్లాక్ పేపర్' విడుదల చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇలా అన్నారు: 'కేంద్రం వివక్ష చూపుతోంది. బిజెపి యేతర పార్టీలు పాలించే అన్ని రాష్ట్రాలను విస్మరిస్తోంది. కర్ణాటక, తెలంగాణ, కేరళ వంటి ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోంది' అని విమర్శించారు. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం అనుసరిస్తున్న ఈ విధానాన్ని అంగీకరించని కేరళ కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం మోడీకి దీటుగా దిగజారుతున్నట్లు కనిపిస్తోంది. కేరళలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ఈ వైఖరి... విస్తృత స్థాయిలో జాతీయంగా బిజెపి వ్యతిరేక కూటమి నిర్మాణానికి అడ్డంకిని సృష్టిస్తోంది. కేరళ చేపట్టిన సమ్మెకు ఖర్గే సహా కాంగ్రెస్ నేతలను ఆహ్వానించామని, అయితే కేరళలోని కాంగ్రెస్ నేతల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో వారు పాల్గొనలేదని మీడియాలో వచ్చిన కథనాలను కాదనలేం.

అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత మోడీ ప్రభుత్వం, సంఘ్ పరివార్ మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, ఢిల్లీలో కేరళ చేపట్టిన దీక్ష రాష్ట్రాలకు జరుగుతున్న ఆర్థిక అన్యాయం, సమాఖ్య వ్యవస్థకు వాటిల్లుతున్న ప్రమాదం వంటి సమస్యలను లేవనెత్తింది. ప్రజల సమస్యను ముందుకు తీసుకు రావడం ద్వారా మతతత్వ శక్తులను ఎలా ఎదుర్కోవాలన్న రాజకీయ సందేశాన్ని కూడా ఈ పోరాటం అందిస్తోంది.

పన్ను కేటాయింపులను నిరాకరిస్తూ, గ్రాంట్లు నిలిపివేసి, రుణ పరిమితిని తగ్గించేసి బిజెపి యేతర రాష్ట్రాలను ఆర్థికంగా కుంగదీస్తున్న కేంద్రానికి వ్యతిరేకంగా దేశ రాజధాని నగరంలో దీక్ష చేపట్టాలనే ఆలోచన మొదటగా కేరళ ప్రభుత్వమే చేసింది. ఒక రాష్ట్ర ప్రభుత్వం రాజధానికి వచ్చి కేంద్రంపై నిరసన తెలపడం అరుదైన ఘటన. స్వతంత్ర భారత చరిత్రలో కేవలం కొన్ని సందర్భాల్లో మాత్రమే ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కలిసి కేంద్రంపై నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రికి, ఆర్థిక మంత్రికి లేఖలు రాయడం, ప్రభుత్వ కమిటీలు, ఫోరమ్‌లలో లేవనెత్తడం, ఆర్థిక నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపడం వంటి ప్రజాస్వామిక మార్గాలన్నీ విఫలమైనప్పుడు ఢిల్లీలో సమ్మె చేస్తున్నట్లు కేరళ ప్రకటించింది.

"ఫెడరలిజంపై కేంద్రం దాడికి వ్యతిరేకంగా ఢిల్లీలో పినరయి విజయన్" అనే శీర్షికతో 'హిందూ' వార్తాపత్రిక సమ్మె కవరేజీకి సంబంధించిన కథనాన్ని ప్రచురించింది. మోడీ హయాంలో రాజ్యాంగ ప్రధాన సూత్రమైన ఫెడరలిజంపై దాడి జరుగుతోందని, ప్రతిఘటిస్తున్నది వామపక్షమేనని 'హిందూ' పత్రిక స్పష్టమైన సందేశం ఇచ్చింది. కేంద్రంపై ప్రతిఘటనకు వామపక్షం నాయకత్వం వహిస్తోందని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' రాసింది. పార్టీల పని తీరును ఎంపీల సంఖ్యతో కొలవడం మూర్ఖత్వమని ఈ వార్తాపత్రికల పరిశీలనలు పదేపదే స్పష్టం చేస్తున్నాయి.

'హిందూ' వార్తాపత్రిక ఇలా రాసుకొచ్చింది...'లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష ఐక్యతను సాధించడంలో కేరళ దీక్ష విజయవంతమైంది'. బీహార్‌లో జె.డి(యు) అధినేత, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ 'ఇండియా' కూటమిని వీడి బిజెపి శిబిరంలోకి వెళ్లడంతో బిజెపి వ్యతిరేక కూటమి కుప్పకూలిందని ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలోనే కేరళ చేపట్టిన నిరసనల్లో నాలుగు రాష్ట్రాల అధికార పార్టీ నేతలతో సహా డజనుకు పైగా రాజకీయ పార్టీలు చేతులు కలిపాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పాటు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, తమిళనాడు మంత్రి పి.త్యాగరాజన్, జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, డిఎంకె నేత తిరుచ్చి శివ, ప్రముఖ న్యాయవాది కపిల్ సిబాల్, వి.కె.కె. నాయకుడు, ఎంపీ తోల్ తిరుమావళవన్ కేరళ సమ్మెలో పాల్గొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా హాజరు కాకున్నా వీడియో సందేశం ఇచ్చారు. వేదిక మీద చూపించారు. ఢిల్లీలో జరిగిన 'ఇండియా' నాలుగో సమావేశం తర్వాత, ఆ కూటమి లోని ప్రధాన పార్టీలు పాల్గొనే వేదికగా విజయన్ నేతృత్వంలో జరిగిన దీక్ష మారింది. ప్రజా సమస్యలను లేవనెత్తడం, పోరాటం చేయడం ద్వారానే కేంద్రంలో బిజెపికి మూడవసారి అధికారం అందకుండా అడ్డుకోగలమన్న పెద్ద సందేశాన్ని అందిస్తోంది.

మతం, కులాల ప్రాతిపదికన ప్రజలను విభజించి అధికారాన్ని పండిస్తున్న బిజెపి, ప్రధాని... కేరళతో పాటు పలు రాష్ట్రాలు చేస్తున్న కేంద్ర వ్యతిరేక పోరాటాన్ని విభజించి పాలించేందుకు అవకాశంగా మలుచుకునే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగానే సమ్మెలో ప్రమాదకరమైన విభజన రాజకీయాలను చూశారు ప్రధాని. దీన్ని 'దక్షిణాది' పోరాటంగా చూపించే ప్రయత్నం జరిగింది. అయితే, ప్రధాని, సంఘ్ పరివార్ వండివార్చిన ఈ తప్పుడు కథనానికి కేరళ దీక్ష సరైన సమాధానం ఇచ్చింది. ఢిల్లీ ముఖ్యమంత్రి ఉత్తరాదికి చెందిన వ్యక్తి. పంజాబ్ ముఖ్యమంత్రి కూడా ఉత్తరాది వారే. ఇంకా ఉత్తరాది రాష్ట్రమైన జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి కూడా పాల్గొన్నారు. కేరళ చేపట్టిన న్యాయమైన అంశం ఉత్తరాది రాష్ట్రాల నుండి మద్దతును పొందగలిగింది. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సమ్మెపై ఉద్ఘాటించారు. భారతదేశ భౌగోళిక పరిస్థితులను ప్రధాని అధ్యయనం చేయాలని ఏచూరి అన్నారు. రాష్ట్రాల న్యాయబద్ధమైన పోరాటాన్ని కూడా వక్రీకరించి దేశద్రోహ జాబితాలో చేర్చే ప్రమాదకర చర్యను మోడీ ప్రభుత్వం చేపట్టింది. తమిళనాడు ముఖ్యమంత్రి వీడియో సందేశంలో చెప్పినట్లుగా, ఫాసిస్ట్ బిజెపిని అధికారం నుండి తరిమి కొట్టడానికి 'ఇండియా' బ్లాక్ లోని అన్ని పార్టీలు ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైంది. అయితే కేరళలోని కాంగ్రెస్ నాయకత్వానికి మాత్రమే ఈ విషయం అర్థం కావడం లేదు. బిజెపిపై సంఘటిత పోరాటాన్ని ఇంకా బలహీనపరుస్తూనే ఉన్నారు. మోడీ మూడోసారి వచ్చినా పర్వాలేదు-కేరళలో వామపక్షాలు కూలిపోతే చాలన్న దానిమీదే కాంగ్రెస్ రాష్ట్ర అధిష్టానం ఆసక్తి కనబరుస్తోంది. కానీ ప్రజల ప్రయోజనాలు, హక్కుల కోసం పోరాడే వామపక్షాన్ని భారీ మెజారిటీతో గెలిపిస్తారన్న విషయాన్ని వీరు త్వరలోనే గుర్తిస్తారు.

'ఫెడరలిజంపై కేంద్రం దాడికి వ్యతిరేకంగా ఢిల్లీలో పినరయి విజయన్' అనే శీర్షికతో 'హిందూ' వార్తాపత్రిక సమ్మె కవరేజీకి సంబంధించిన కథనాన్ని ప్రచురించింది. మోడీ హయాంలో రాజ్యాంగ ప్రధాన సూత్రమైన ఫెడరలిజంపై దాడి జరుగుతోందని, ప్రతిఘటిస్తున్నది వామపక్షమేనని 'హిందూ' పత్రిక స్పష్టమైన సందేశం ఇచ్చింది. కేంద్రంపై ప్రతిఘటనకు వామపక్షం నాయకత్వం వహిస్తోందని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' రాసింది. పార్టీల పని తీరును ఎంపీల సంఖ్యతో కొలవడం మూర్ఖత్వమని ఈ వార్తాపత్రికల పరిశీలనలు పదేపదే స్పష్టం చేస్తున్నాయి.

/ వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు / 'దేశాభిమాని' సౌజన్యంతో/

కవిత్వం

నాగలి ఎగరేసిన ప్రశ్న

రాముడే జెండా ఎజెండా చేసే
ఊదరతో ఊరేగే పాలనలో
బతుకుకు మెతుకే ఎజెండాగా
ఎత్తినందుకేగా ఈ కర్కశత్వం
మీ పాలన కసిగా ఉసిగొలిపిన
కాకీల లాఠీ దెబ్బల కాఠిన్యం
ఎంత కాలం ఈ మూర్ఖత్వం?

పచ్చని పొలం పంట సాక్షిగా
ఇప్పుడు గ్రామీణ భారతం
కదం తొక్కి కన్నెర్ర చేసింది
బురద మట్టిని మెతుకు చేసే
రైతు తపమా? రామ జపమా?
దేశం దేనివైపుందని ప్రశ్నిస్తోంది
మద్దతు ధరే నాగలికి ఊపిరని
లేకుంటే మెతుకు చేతికి రాదని
తలపాగాలు ఘంటా కంఠంగా
చాటింపేసి చాటుతున్నాయి.

ముళ్ళ కంచెలు, నీటి ఫిరంగులు
లాఠీ దెబ్బల విషపు గాట్ల సాక్షిగా
ఇది దేశం ఎజెండా చేయకుంటే
రైతులేని బతుకు జనతకు లేదని
ఇప్పుడిక గుర్తించాల్సింది జనమని
నాగలి కేతనంగా ఎగరేసినపుడే
జనమే జయులై మన్నుతారని
మనుషులై దేశంలో మిగులుతారని.

- ఉన్నం వెంకటేశ్వర్లు

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

సాహస వనితలు సమ్మక్క సారక్క !

కామెంట్

డా॥ దేవరాజు మహారాజు

తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో రెండు సంవత్సరాలకు ఒకసారి సమ్మక్క సారక్కల జాతర జరుగుతుంది. దీనికి చుట్టు పక్కల రాష్ట్రాల నుండి కూడా అధిక సంఖ్యలో జనం వస్తుంటారు. సమ్మక్క సారక్కలు గిరిజనులు కానట్టు 'దేవతలు'-అని చెప్పడం ఒక మోసం! సమ్మక్క సారక్కలు, పగిడిద్దరాజు, జంపన్నలు ఆదివాసీ గిరిజనులు. వీరు తమ హక్కుల కోసం పోరాడుతూ అమరులైన వారు. కేవలం గిరిజన వీరులు మాత్రమే!

వీరి చారిత్రక నేపథ్యం ఇలా ఉంది. సాధారణ శకం 12వ శతాబ్దం ఓరుగల్లును కాకతీయులు నిరంకుశంగా పాలిస్తున్న రోజులు. ఇతర ప్రాంతాలపై ఆధిపత్యం కోసం తాపత్రయపడిన ప్రతాపరుద్రుడు గిరిజనుల నాయకుడైన పగిడిద్ద రాజును ఆహ్వానించి, గిరిజనులతో తన పాలనలోకి రావాలని కోరాడు. అతను అందుకు సమ్మతించకపోవడంతో అనేక విధా లుగా ప్రయత్నించాడు. ఏ ప్రయత్నమూ ఫలించకపోవడంతో విపరీతంగా ఒత్తిడి పెంచాడు. పగిడిద్దరాజు నాయకత్వంలో ఉన్న గిరిజనులెవరూ లెక్కచేయలేదు - అసహనంతో రగిలిపోయిన ప్రతాపరుద్రుడు - "తన ఆజ్ఞను అతిక్రమించిన వారికి మరణ దండన తప్పదని" బెదిరించాడు. స్వేచ్ఛగా బతుకుతున్న ఆదివాసీ గిరిజనులు మరొకరి అదుపు ఆజ్ఞలతో ఉండడానికి ఇష్టపడలేదు. కాకతీయ రాజు ప్రతాపరుద్రుని మాట తిరస్కరించారు.

ప్రతాపరుద్రుడు గిరిజనులపై యుద్ధం ప్రకటించి, నానా బీభత్సం సృష్టించాడు. వారి జీవితాల్ని అతలాకుతలం చేశాడు. ఆ యుద్ధానికి సంబంధించిన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి - గిరిజనుల రాజైన మేడరాజు, పెంపుడు కూతురు సమ్మక్కను తన మేనల్లుడైన పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం జరిపిస్తాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు - సంతానం. మేడారం పాలకుడైన పగిడిద్దరాజు కాకతీయులకు సామంతుడు. రాజ్యకాంక్షతో ప్రతాపరుద్రుడు, మేడ రాజు పాలించే పొలబాసపై దండెత్తుతాడు. ఆ దాడి తట్టుకోలేక మేడరాజు తన కూతురు దగ్గరికి మేడారం పారిపోయి అక్కడ అజ్ఞాతవాసం గడుపుతుంటాడు. ఆ సమయంలో వచ్చిన కరువు కాటకాల వల్ల పగిడిద్దరాజు కాకతీయులకు కప్పం చెల్లించలేక పోతాడు. కప్పం చెల్లించకపోవడం ఒక కారణమైతే, తన మామగారైన మేడరాజుకు ఆశ్రయం కల్పించడం మరో కారణం. తనకు లొంగిపోనని చెప్పిన పగిడిద్దరాజును ఇక యుద్ధంతోనే లొంగదీసుకోవాలనుకుని, తన మంత్రి యుగంధరుడితో కలిసి, ప్రతాపరుద్రుడు పగిడిద్దరాజుపై యుద్ధం ప్రకటించాడు. తన కొడుకు జంపన్నను తీసుకుని, బలగాలను సమాయత్తం చేసి, కాకతీయ సైన్యాలను ఎదుర్కొంటాడు పగిడిద్దరాజు. వీరోచితంగా పోరాడుతూ పగిడిద్దరాజు, గోవిందరాజులు ప్రాణాలు వదిలేస్తారు. దాంతో, సమస్య తీరిందని ప్రతాపరుద్రుడు సంబరపడ్డాడు. కానీ, ఆ సంతోషం ఎంతోసేపు నిలువలేదు.

గిరిజన మహిళలు సంఘటితమై మళ్లీ విజయ దుందుభి మోగించారు. ఈ సారి సమ్మక్క, తన కూతురు సారక్కతో కలిసి సారథ్యం వహించింది. అతి పెద్దదైన, సుశిక్షితులైన కాకతీయ సైనికులతో గిరిజన మహిళలు గెలవలేకపోయారు. సమ్మక్క, సారక్క, నాగమ్మ - అనేక మంది గిరిజనులు వీరమరణం పొందారు. ఓటమిని భరించలేక జంపన్న దగ్గరగా ఉన్న సంపెంగవాగులో దూకి ఆత్మహత్య చేసుకుంటాడు. ఆనాటి నుండి సంపెంగవాగు జంపన్నవాగుగా పిలవబడుతోంది. కాక తీయుల దృష్టిలో ఇది ఒక సంఘటన మాత్రమే. గిరిజన ప్రాంతాలు స్వాధీనం చేసుకోగలిగినందుకు విజయోత్సవాలు జరుపు కున్నారు. కానీ, గిరిజనుల దృష్టిలో ఇది ఒక మహోజ్వల చారిత్రక ఘట్టం! బలవంతుడైన కాకతీయరాజును ఎదుర్కొని తమ గిరిజన అస్థిత్వాన్ని నిలుపుకోవడానికి వీరోచితంగా పోరాడిన సాహసోపేతమైన ఘనకార్యం!! అసువులు బాసిన గిరిజన అమర వీరుల్ని స్మరించుకోవడానికి ఏర్పడ్డ గొప్ప అవకాశం. దాన్ని వారు శతాబ్దాలుగా కొనసాగిస్తూ వస్తున్నారు. అదే కార్యక్రమంలో సమ్మక్క, సారక్క జాతరగా స్థిరపడింది.

ఆదివాసీలను, వారి విశ్వాసాల్ని ప్రభుత్వ ఎండోమెంట్ శాఖ, చాకచాక్యంగా దోపిడీ చేస్తున్నట్టుగా ఉంది. మరీ ముఖ్యంగా వీరనారీమణుల్ని "దేవతలుగా" ప్రచారం చేయడంతో ప్రజల్ని అంధవిశ్వాసాల్లో ముంచి ఎదగకుండా చేస్తోంది. అది చాలా ప్రమాదం! దేశ వ్యాప్తంగా వైదిక మతం ఆదివాసీ, గిరిజన, జానపద సంస్కృతులను ధ్వంసం చేస్తోందనడానికి ఇదొక మంచి ఉదాహరణ! దీనికి మనువాదుల ప్రభావంలో కొట్టుకుపోయిన ప్రభుత్వాధినేతలే కారణం. సమ్మక్క సారక్కలు వీరవనితలన్నది జనం మరిచిపోయారు. వారిని కోరికలు తీర్చే దేవతలయినట్టు భావిస్తున్నారు. వారి సంస్కృతికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు కాకుండా, ఆనందోత్సాహాలతో పండగ చేసుకుంటున్నారు.

కాకతీయులతో పోరాడి వీరమరణం పొందిన పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, జంపన్నలను రెండేళ్లకు ఒకసారి గుర్తు చేసుకుంటారు. అదే మేడారం జాతర. ఆ సందర్భానికి చుట్టు పక్కల ప్రాంతాల నుండి గిరిజనులు, ఆదివాసులు, కొంతమంది గ్రామస్తులు అక్కడికి చేరుకుంటారు. పల్లెల నుండి మాత్రమే కాకుండా, పట్టణాలు, నగరాల నుండి కూడా జనం అధిక సంఖ్యలో అక్కడికి చేరుతుండడంతో 1967లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ జాతరను తన పరిధిలోకి తీసుకుంది. ప్రభుత్వ ఎండోమెంట్‌శాఖ, వచ్చిపోయే వారికి రవాణా సౌకర్యం కల్పించింది. ఇంత వరకు బాగానే ఉంది. కానీ, తరువాత జరుగుతూ వచ్చిన ప్రచారం మూఢనమ్మకాల వ్యాప్తికి దారితీసింది.

ప్రభుత్వ జోక్యంతో స్థాయి పెంచుకున్న ఈ జాతర, ఇతర రాష్ట్రాల నుండి కూడా జనాన్ని ఆకర్షిస్తోంది. వ్యాపారాలు వృద్ధి చెందాయి. ప్రభుత్వ ఆదాయం పెరిగింది. కానీ, వాస్తవంగా అనేక అకృత్యాలకు అది నిలయమవుతూ వచ్చింది. పరిసర ప్రాంతాలన్నీ మలమూత్రాలతో కలుషితమయ్యాయి. అధిక సంఖ్యలో వచ్చిపోయే వాహనాలతో అక్కడ కార్బన్ మొనాక్సైడ్ స్థాయి పెరిగి, శుభ్రమైన గాలి దొరక్కుండా పోయింది. గిరిజన సంస్కృతిని గిరిజన సంస్కృతిగా ఉండనీయక, నగరవాసులు దాన్నొక షాపింగ్ మాల్‌లాగా మార్చారు. అంతకుముందు చుట్టుపక్కల ఉన్న గ్రామాలన్నీ తాగునీటి కోసం జంపన్న వాగుపై ఆధారపడేవి. జాతర వల్ల వాగు నీరు మురికై పోవడం వల్ల, అనేక గ్రామాలు తాగునీటికై ఇబ్బంది పడుతున్నాయి. కలరా, అతిసార వంటి అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయి. తమ జీవన స్థితిగతుల గూర్చి ఆలోచించండని గిరిజనులు ఎన్నోసార్లు ప్రభుత్వానికి నివేదికలిచ్చారు. జన జీవితాన్ని అస్తవ్యస్తం చేసే జాతరలు అవసరమా? అంటే, ప్రభుత్వానికి వాటివల్ల వచ్చే ఆదాయం అవసరం! రెండేళ్ళకోసారి వారం పది రోజులు జరిగే సమ్మక్క సారక్క జాతర అక్కడి ప్రజా జీవితాన్ని నాశనం చేస్తోంది. ఆదివాసీలను, వారి విశ్వాసాల్ని ప్రభుత్వ ఎండోమెంట్ శాఖ, చాకచాక్యంగా దోపిడీ చేస్తున్నట్టుగా ఉంది. మరీ ముఖ్యంగా వీరనారీమణుల్ని "దేవతలుగా" ప్రచారం చేయడంతో ప్రజల్ని అంధవిశ్వాసాల్లో ముంచి ఎదగకుండా చేస్తోంది. అది చాలా ప్రమాదం! దేశ వ్యాప్తంగా వైదిక మతం ఆదివాసీ, గిరిజన, జానపద సంస్కృతులను ధ్వంసం చేస్తోందనడానికి ఇదొక మంచి ఉదాహరణ! దీనికి మనువాదుల ప్రభావంలో కొట్టుకుపోయిన ప్రభుత్వాధినేతలే కారణం-సమ్మక్క సారక్కలు వీరవనితలన్నది జనం మరిచిపోయారు. వారిని కోరికలు తీర్చే దేవతలయినట్టు భావిస్తున్నారు. వారి సంస్కృతికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు కాకుండా, ఆనందోత్సాహాలతో పండగ చేసుకుంటున్నారు.

ఇలాంటిదే మరొక విషయం చూద్దాం! తమిళనాడులోని ఇరళర్లే- తెలుగులో ఇరగాలోళ్లు అయ్యింది. వీరిది అడవిని ఆధారం చేసుకుని బతికే ఒక ప్రాచీన తెగ. నెల్లూరు ప్రాంతంలో వీరినే యానాదులు అంటున్నారు. వేటాడటం, పాములు పట్టడం వీరి వృత్తి. నెల్లూరు ఒక గ్రామంగా ఉన్నప్పుడు అక్కడ అధిక సంఖ్యాకులైన ఇరగాలోళు నెల్లూరు చెరువుకి ఉత్తరం గట్టున నెలకొల్పుకున్న గ్రామ దేవత-ఇరగాలమ్మ. కాలక్రమంలో వైదిక మతస్తుల ప్రభావంతో ఆ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మగా రూపాంతరం చెందింది. గోపురం ధ్వజస్తంభం వెలసి, ధూప దీప నైవేద్యాలతో హిందూ దేవాలయమైపోయింది.

నెల్లూరు జిల్లా సుళ్ళూరిపేటలోని చెంగాలమ్మ గుడి కథ కూడా దాదాపు ఇలాంటిదే. యానాదులను కొన్ని ప్రాంతాల్లో చెంచోర్లు అని కూడా పిలిచేవారు. వారు నెలకొల్పుకున్న దేవత పేరు చెంచోరు లేదా చెంచోరమ్మ అని వ్యవహరించేవారు. ఆ పేరే కాలక్రమంలో చెంగాళమ్మ అయ్యింది. ప్రస్తుతం అమ్మ పేరు 'తెన్ కాళి అమ్మ'గా మారిపోయింది. అక్కడ ఇరుకళల పర మేశ్వరి అమ్మకు అమరిన హంగులన్నీ-ఇక్కడ తెన్‌కాళి అమ్మకు కూడా అమిరాయి. శ్రీశైలం గుడి చెంచులదే - అన్న విషయం అందరికీ తెలిసిపోయింది. అయినా, ఇప్పుడు ఈ గుడులేవీ చెంచులవి, యానాదులవి కావు. వైదిక మత ప్రభావంతో అవన్నీ ఆదివాసీ చేయి దాటిపోయాయి. అంతే కాదు ఒకప్పటి వాటి మూల సంస్కృతిని పోగొట్టుకున్నాయి.

ఇకపోతే, గోదావరి జిల్లాల్లోని నూకాలమ్మ 'నూకాంబిక' అయ్యింది. తెలంగాణ గ్రామాల్లోని ఎల్లమ్మ - ఎల్లమాంబా దేవి అయ్యింది. ఆదివాసీల జానపదుల గుళ్లన్నీ హిందూ దేవాలయాలుగా మన కళ్ల ముందే రూపాంతరం చెందుతూ వచ్చాయి. పోలేరమ్మ జాతర, పంబాలోళ్ల వేడుకలన్నీ మార్పునకు గురయ్యాయి. ఒక వైపు హైందవం, మరో వైపు క్రైస్తవం గిరిజనులు, దళితుల మూలల్ని ఒక పథకం ప్రకారం ధ్వంసం చేస్తూ వచ్చాయి. ఒకప్పుడు బౌద్ధ, జైన ఆలయాల్ని ధ్వంసం చేసి హిందూ దేవాలయాలుగా మార్చుకున్నట్టు-తర్వాత కాలంలో గిరిజన, ఆదివాసీ, దళిత, శూద్రజాతులు నెలకొల్పుకున్న దేవుళ్లను, గుళ్లను హైందవం తీవ్రంగా దెబ్బతీసింది. ఆలయాల గోడలపై స్త్రీ పురుషుల నగ్నశిల్పాల్ని చెక్కుకుని ఆలయాల్ని కామ కలాపాలకు వాడుకున్నది వైదికమతం. దేవదాసీ వ్యవస్థను ప్రోత్సహించి, బలవంతపు వ్యభిచారం నడిపించిన ఘనత సనాతన వాదులదే కదా? ఇప్పుడు ఆ మూలాల్ని, ఆ మూల సంస్కృతిని నిలుపుకోవడం మన వల్ల కాకపోవచ్చు. కానీ, సనాతనవాదుల అడ్డగోలు వాదనలు ఎదుర్కోవాలంటే, కనీసం మన మూలాల గూర్చి కొంతలో కొంతైనా తెలుసుకోవాలి కదా? గతం తెలుసుకున్న వారే భవిష్యత్తుకు దారులు వేయగలరు.

/ వ్యాసకర్త కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త - మెల్బోర్న్ నుంచి /

★

మిమ్స్ ఉద్యోగులకు సిఐటియు అండ

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ స్పష్టం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్‌ఒబి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఉద్యోగులు, కార్మికులు గత 15 రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమాన్ని గురువారం ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం నియంతృత్వ దోరణితో ఉద్యోగులకు డిఎ బకాయిలు చెల్లించకుండా, వేతన ఒప్పందం చేయకుండా వారిని వేధింపులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా సేవలు అందించిన ఉద్యోగులు, కార్మికులకు వారి బాగోగులు చూడాల్సిన యాజమాన్యం సమస్యలు పరిష్కరించాలని అడిగితే సస్పెన్స్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మిమ్స్ యాజమాన్యం కొండను ఆక్రమించుకొని నిర్మాణాలు చేస్తున్నా అడిగేవారు లేరని, మిమ్స్‌లో నాటి బ్రిటీష్ పాలన తలపించేలాఉద్యోగులు, కార్మికులను కట్టు బానిసలుగా చూడడం తగదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం డిఎ బకాయిల చెల్లించి వేతన ఒప్పందం చేసి సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా ఉండాలని సిఐటియు అండగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్య నారాయణ, జిల్లా ప్రధాకార్యదర్శి కె.సురేశ్, మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ, సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. గురువారం ఆయన నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు సమస్యల వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. రెండు మూడు రోజుల్లో మిమ్స్ యాజమాన్యంతో మాట్లాడి చర్చలు జరిపి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం పరిశీలకులు అందవరపు సూరిబాబు, జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, నాయకులు చిక్కాల సాంబశివరావు, సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, డి.గిరిబాబు, పతివాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కాని వ్యవసాయం

- దళారులు నిర్ణయించిందే ధర!
- కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఏటేటా వరి సాగు అన్నదాతల పాలిట ఉరితాళ్లవుతున్నాయి.. రైతే రాజు..దేశానికి పట్టెడన్నం పెట్టేది రైతన్నేనంటూ గొప్పలు చెప్పడమే తప్ప కనీస మద్దతు ధర(ఎంఎస్‌పి) ప్రకటించే కనీస ఆలోచన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం లేదు. ఫలితంగా అన్నదాత అరుగాలం శ్రమ అప్పుల పాలవుతోంది. ధాన్యానికి గిట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో రైతు దగా పడాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి విపత్తులను తట్టుకుని..కష్టపడి సాగు చేసి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సరైన సమయంలో కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నకు ఈ పరిస్థితి దాపురిస్తోంది.

దళారులు నిర్ణయించిందే ధర!

ఏటా పెట్టుబడి, కూలీలు, ఎరువుల ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప రైతు పండించిన ధాన్యానికి మాత్రం గిట్టుబాటు ధర మాత్రం పెరగడం లేదు. పదేళ్ల కిందట ఎకరా పొలంలో వరిని పండించేందుకయ్యే ఖర్చు రూ.10 వేలు కాగా ఇప్పుడు రూ.35 వేలకు చేరుకుంది. అయితే 75 కిలోల ధాన్యం బస్తాకు చెల్లిస్తున్న గిట్టుబాటు ధర మాత్రం రూ.1700 లోపే ఉంటోంది. గతేడాది గ్రేడ్-1 పరిధిలోకి వచ్చే వరి రకాలకు రూ.1727, సాధారణ రకాలకు రూ.1512 చెల్లిస్తానని చెప్పింది. అయితే మిల్లర్లు, దళారీలు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు చెల్లిస్తున్న ధర మాత్రం రూ.1400 నుంచి రూ.1550 వరకు ఉంటోంది.

ఈ ఏడాది జనవరిలో గ్రేడ్-1 వరి రకం 80 కిలోలకు రూ.2500 మద్దతు ధర పలికింది. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకోవడంతో దళారీలు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధరను ఏకంగా రూ.2100కు తగ్గించారు. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర లేక పోయినా వేరే దారి లేక దళారులు నిర్ణయించిన ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది.

త్వరలోనే ఏర్పాటు చేస్తాం: రమేష్‌బాబు, ఏడి, శ్రీకాళహస్తి

రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. తొట్టంబేడు మండలంలో ఎక్కువ మంది డిసెంబరు, జనవరి నెలల్లో మాత్రమే వరి నాట్లు వేస్తారు. అవి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కోతకు వస్తాయి. ఈ ఏడాది మార్చి నెలలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధర కూడా రైతులకు గిట్టుబాటయ్యే అవకాశాలే అధికంగా ఉంటాయి. రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదు.

తిరుపతిలో తాగునీటి ఎద్దడి

- వేసవి ముందస్తు జాగ్రత్తలు ఏవి..?
- మూడురోజులకు ఒకసారి సరఫరా
- ప్రత్యామయంగా ట్యాంకర్లతో పంపణి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే కౌన్సిల్లో తాగునీటి సమస్యపై ముందస్తు చర్చించి వేసవి జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం. గతంలో రోజుమార్చి రోజు తాగునీటిని వదిలేవారు. తాజాగా మూడు రోజులకోసారి వదులుతున్నారు. కొన్ని డివిజన్లలో అరగంట, మరికొన్ని డివిజన్లలో 45 నిమిషాలు సరఫరా చేస్తున్నారు. యూనివర్సిటీలు, ఆస్పత్రులకు మీటర్లు పెట్టి సరఫరా చేస్తున్నారు. నగరంలో మూడు లక్షల జనాభా ఉంది. తిరుపతికి రోజుకు 80వేల మంది యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన నీటి వనరులు తెలుగుగంగ. శ్రీకాళహస్తి కైలాసగిరి రిజర్వాయర్ నుంచి రామాపురం రిజర్వాయర్ ద్వారా దాదాపు 37 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. నగరంలో 12 ఫిల్టర్ ట్యాంకులు ఉన్నాయి. అమృత్ పథకంలో నిర్మించిన 11 ట్యాంకులున్నాయి. తెలుగుగంగతో పాటు చంద్రగిరి నియోజకవర్గంలో కల్యాణిడ్యాం ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. రామాపురం రిజర్వాయర్ వద్ద విద్యుత్ సమస్య వస్తే తెలుగుగంగ నీటి సరఫరా సమస్య ఏర్పడుతుంది. వేసవిలో ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ సమస్యలు వస్తున్నట్లు నగర వాసులు మండిపడుతున్నారు.

3 ఎంఎల్‌డిలు కొరత

రోజుకు 65 ఎంఎల్‌డిల డిమాండ్ ఉంది. తెలుగుగంగ ద్వారా 44 ఎంఎల్‌డిలు, కల్యాణిడ్యాం ద్వారా 20 ఎంఎల్‌డిలు, 534 చేతిబోర్ల ద్వారా 1.47 ఎంఎల్‌డిల నీటిని అందిస్తున్నారు. మొత్తం 62 ఎంఎల్‌డిలు నీటిని సరఫరా చేస్తున్నారు. 3 ఎంఎల్‌డిల కొరత ఉంది. నీటి సమస్య ఉన్న డివిజన్‌లో రోజుకు 16 నీటి ట్యాంకర్ల ద్వారా 0.75 ఎంఎల్‌డిల నీటిని సరఫరా చేస్తున్నారు. అమృత్ పథకంలో కొన్ని ట్యాంకుల నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి ఉంది. మురికివాడ ప్రాంతాల్లో నీటి సమస్య జఠిలంగా ఉంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అరకొరగానే సరిపోతున్నాయని మహిళలు వాపోతున్నారు. మధ్యాహ్నం పూట ట్యాంకర్లను తీసుకురావడం వల్ల అప్పటికే కొంతమంది ఉద్యోగాలకు వెళ్లిపోవడం, షాపుల్లో పనులకు వెళ్లిపోవడం జరుగుతుంది. దీంతో ఆయా ఇళ్లల్లో తాగునీటి కొరత తప్పనిసరి. ఇక అపార్టుమెంట్‌వాసులు, వ్యాపార సముదాయం కలిగినవారు రూ.వెయ్యి నుంచి 5వేలు తక్కువ లేకుండా చెల్లించి నీటిని తెప్పించుకుంటున్నారు.

స్కాడ్కా సెంటర్ గాలికి..!

తిరుపతి అలిపిరి ఫిల్టర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన స్కాడ్కా సెంటర్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గాలికొదిలేశారు. స్కాడ్కా వల్ల ఎక్కడ తాగునీటి పైపులైన్ లీకేజికి గురవుతుందో కమాండ్ కంట్రోల్ ద్వారా పరిశీలించి లీకేజీలను మరమ్మతు చేసేవారు. అయితే ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రెన్యువల్ చేసుకోలేదు.

నీటి సమస్య లేకుండ చర్యలు : మోహన్,మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ

వేసవిలో తాగునీటి సమస్య లేకుండ చర్యలు తీసుకుంటాం. రామాపురం వద్ద గాలి వానకు విద్యుత్ సరఫరా సమస్య వచ్చి తెలుగుగంగనీటికి అంతరాయం కలిగింది. విద్యుత్ సమస్య ఏర్పడకుండ ఉండేందుకు ఎస్‌పిడిసిఎల్ అధికార్లతో సంప్రదించాం.

అఖిల భారత పోలీసు కమాండోలకు డిజిపి అభినందన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో జనవరి 18 నుంచి 30 వరకు జరిగిన 14వ అఖిల భారత పోలీసు కమాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున అత్యుత్తమ ప్రదర్శన చేసిన రాష్ట్ర పోలీసులను డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఆయన కార్యాలయంలో అభినందించారు. ఈ పోటీల ద్వారా సామర్థ్యం, విశ్వాస స్థాయిలు, శారీరక, మానసిక ప్రమాణాలు, జట్టు కృషి తదితర అంశాలు మెరుగుపడతాయని డిజిపి తెలిపారు. ఈ పోటీల్లో వివిధ ట్రోఫీలతోపాటు బెస్ట్ స్టేట్ పోలీస్ కమాండో టీమ్, రణ-నీతి, చక్రవ్యూహ్-1 రూరల్ చక్రవ్యూహ్-2, అర్బన్, బ్లాక్ హాక్ ఫైరింగ్, చీతా రన్, బెస్ట్ టీమ్ ఇన్ కాన్ఫిడెన్స్ కోర్సు, కమాండో కాంపిటేషన్ హార్డ్ లైనర్ (బ్రోంజ్), కమాండో కాంపిటేషన్ రన్నరప్ (సిల్వర్), కమాండో కాంపిటేషన్ విన్నర్ (గోల్డ్) వంటి మొత్తం 10 ట్రోఫీల కోసం 300 మంది పోలీసుల్లో రాష్ట్ర పోలీసులు 23 అంశాల్లో రాణించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేహౌండ్స్ చీఫ్ ఆర్‌కె మీనా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిని రాష్ట్ర రాజధాని చేయాలి

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధానిగా తిరుపతిని ప్రకటించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలో ఆయన మీడియా తో మాట్లాడారు. రాజధాని అంశంలో ఆంధ్రప్రదేశ్‌కు మొదటి నుండి అన్యాయం జరుగుతోందని తెలిపారు. మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి వచ్చినపుడు ఎన్‌జి రంగా తిరుపతిని రాజధానిగా చేయాలని ప్రతిపాదన చేస్తే అప్పటి రాజకీయాల్లో బలవంతుడైన నీలం సంజీవరెడ్డి కోరిక మేరకు కర్నూలుకు తరలిపోయిందన్నారు. ఆ తర్వాత కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రాజధాని వెళ్లిపోయిందని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు తుళ్లూరులో పెడితే.. ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడుతున్నారని విమర్శించారు. ఇప్పుడు హైదరాబాద్ రాజధానిగా మరికొంతకాలం వుండాలని కోరడం వైసిపి దివాళాకోరుతనం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని టిడిపి, వైసిపి భ్రష్టు పట్టించాయని విమర్శించారు. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందన్నారు. చిరంజీవి మళ్లీ రాజకీయాల్లోకి రావాలని కోరారు.

HDFC BANK

హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్.

బ్రాంచి చిరునామా: ప్లాట్ నెం.98, 3వ అంతస్తు, కేషరీ టాకీస్ ఆఫీస్ కాంప్లెక్స్, ఖర్వేల్ నగర్, భువనేశ్వర్-751001, ఫోన్: 0674-6633300.
రిజిస్టర్డు ఆఫీసు: హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ హౌస్, సేనపతి బపత్ మార్గ్, లోవర్ పెరల్ (పడమర), ముంబాయి-400013.
CIN: L65920MH1994PLC080618, Website: www.hdfcbank.com

స్థిరాస్తుల యొక్క వేలం కొరకు అమ్మకం ప్రకటన (కేవలం ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే అమ్మకం)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) సందలి నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు.
సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా కాలమ్ (ఎ)లో సూచించబడిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన / చార్జీచేయబడిన కాలమ్ (సి)లో వివరించబడిన దిగువనీయబడిన స్థిర ఆస్తి (ఆస్తులు) హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే కాలమ్ (డి)లో తెలిపిన విధంగా సంబావిత / భౌతిక స్వాధీనత చేపట్టబడినవి. (పూర్వపు హెచ్.డి.ఎఫ్.సి లిమిటెడ్ ను హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్‌తో విలీనం చేయబడింది, గౌరవనీయమైన యన్.సి.ఎల్.టి-ముంబై 17 మార్చి 2023 నాటి ఆర్డర్ ద్వారా ఆమోదించబడిన సమ్మేళనం పథకం ద్వారా పరిమితం చేయబడింది). అవి దిగువ తెలిపిన వివరాల ప్రకారం **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే స్థితి లో** (హెచ్.డి.ఎఫ్.సి) సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా విక్రయించబడతాయి.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) క్రింద కాలమ్ (ఎ) లో సూచించిన ఋణగ్రహీత(లు)/ తనఖాదారు(లు) / సంబంధిత ఋణగ్రహీత(లు) / తనఖా ఋణగ్రహీత(లు) (మరణించినందున) యొక్క చట్టబద్ధవారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెల్సిన లేదా తెలియనివారైనా), ఎగ్జిక్యూటరు(లు), అడ్మినిస్ట్రేటరు(లు), ఉత్తరాధికారు(లు) మరియు అసైన్(ల)కు సందర్భాన్నిబట్టి ఇందుమూలముగా తెలియజేయడమైనది. అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ అనగా **www.hdfcbank.com** లో ఇవ్వబడిన లింక్‌ను చూడండి.

క్ర. సం.	(ఎ)	(బి)	(సి)	(డి)	(ఇ)	(ఎఫ్)	(జి)	(హెచ్)	(ఐ)
	ఋణగ్రహీత(ల)/తనఖా ఋణగ్రహీత(ల)/ గ్యారంటరు(ల)/సంబంధిత ఋణగ్రహీత(ల)/ తనఖా ఋణగ్రహీత(ల)/గ్యారంటరు(ల) (మరణించినందున) యొక్క చట్టబద్ధ వారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెల్సిన లేదా తెలియనివారైనా), ఎగ్జిక్యూటరు(లు), అడ్మినిస్ట్రేటరు(లు), ఉత్తరాధికారు(లు) మరియు అసైన్(ల) పేర్లు సందర్భాన్ని బట్టి.	రాబట్టుకోవల్సిన బకాయిలు (హామీగల రుణం) (రూ.)	స్థిరాస్తి వివరాలు/హామీగల ఆస్తి వివరము 1 చ.మీటర్ 10.76 చ.అ.లకు సమానం)	స్వాధీనత రకం	రిజర్వ్ ధర	ధరావతు (రూ.)	వేలం తేది మరియు సమయం	తనిఖీ తేది	బిడ్ దాఖలుకు చివరి తేదీ:
1	శ్రీ పెరంబుదూరు దివాకర్ ప్లాట్ నెం-87, ఖర్వేల్ నగర్, యూనిట్ - 3, భువనేశ్వర్-751001.	ది. 30-జూన్-2015* నాటికి రూ. 22,91,744/- (అక్షరాల ఇరవై రెండు లక్షల తొంభై ఒక్క వేల ఏడువందల నలభై నాలుగు రూపాయిలు మాత్రమే)	విజయవాడ-520014, గొల్లపూడి, విజయ కృష్ణ టవర్స్ పక్కన, గొల్లపూడి హైస్కూల్ ఎదురుగా, ఆర్.యస్.నెం. 586/2, డోర్ నెం.15-83 దగ్గర, ఆకాష్ రెసిడెన్సీ, 3వ అంతస్తు, ఫ్లాట్.నెం-టి.ఎఫ్-3, 960 చ.అ. లేదా 89.21 చ.మీ. (బిల్డప్ ఏరియా) లేదా దాని చుట్టూ.	భౌతికంగ	రూ. 7,40,000/- (ఏడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)	రూ. 74,000/- (డెబ్బై నాలుగు వేల రూపాయలు మాత్రమే) కనీస ధరావత్తు ధర పెంపు రూ. 10,000/-	18-03-2024 నాటి ఉ 10.00 గం॥ల నుండి మ. 03.00 గం॥ మధ్య (5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో అమ్మకం ముగిసే వరకు)	15-03-2024 ఉ॥ 11 గం॥ల నుండి సా॥ 4 గం॥ల మధ్య	15-03-2024 నాటి సాయంత్రం 05.15 లోగా

*చెల్లింపు మరియు / లేదా వసూలు తేది వరకు వర్తించు విధంగా సాలుకు 18% చొప్పున తదుపరి వడ్డీ, అయిన సంభవనీయ ఖర్చులు, వ్యయాలు, చార్జీలు వగైరా సహా.
HDFC యొక్క అధీకృత అధికారికి తెల్సినంత మరియు అతని వద్ద ఉన్న సమాచారం మేరకు పై స్థిరాస్తులు / హామీగల ఆస్తులకు సంబంధించి ఎట్టి ఎన్‌కంబ్రెన్సులు లేవు.

తేది : 16-02-2024
ప్రదేశము : విజయవాడ

సం/- అధీకృత అధికారి
హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking — సిండికేట్ Syndicate

బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276), డి.నెం. 3-28-12, 4వ లేను, బృందావన్ గార్డెన్స్ నార్త్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522006. ☎ 0863-2231230, 9440905117

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టం" గా పిలవబడును) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత(లు): 1. M/s. గాయత్రి కన్‌స్ట్రక్షన్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్లు: 2. శ్రీ వట్టిగుంట నాగి రెడ్డి, తండ్రి: సాంబిరెడ్డి, 3. శ్రీమతి వట్టిగుంట శివ కుమారి, భర్త: నాగిరెడ్డి, 4. శ్రీ వట్టిగుంట శివ సాంబిరెడ్డి, తండ్రి: నాగిరెడ్డి, 5. శ్రీమతి వట్టిగుంట గౌతమి, భర్త: శివ సాంబిరెడ్డి** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 2,76,11,015/- (అక్షరాల రెండు కోట్ల డబ్బై ఆరు లక్షల పదకొండు వేల పదిహేను రూపాయలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **07.08.2023న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

సెక్యూర్డ్ క్రెడిటార్స్ ఇండియన్ బ్యాంక్ వారికి **శ్రీ జంజనం హేమ కిరణ్ ప్రసాద్,** తండ్రి : శ్రీమన్నారాయణ & **శ్రీ జంజనం సాయి కిరణ్,** తండ్రి : శ్రీ జంజనం హేమ కిరణ్ ప్రసాద్ గార్లు ది. 01-06-2023 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ. 34,82,238/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల ఎనభై రెండు వేల రెండు వందల ముప్పై ఎనిమిది రూపాయలు మాత్రమే)** (ది : 02-06-2023 నాడు డిమాండ్ నోటీసు ఇచ్చినప్పటికీ చెల్లింపుచేయుటలో ఋణగ్రహీత విఫలమైనారు) తదుపరి వడ్డీ,కాస్టులు, ఇతర ఛార్జీలు మరియు ఖర్చులు వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, గాంధీనగర్ బ్రాంచి యొక్క అధీకృత అధికారి వారిచే స్వాధీనత పరచుకోబడిన బ్యాంక్ తనఖా / ఆధీనంలో ఉన్న దిగువ వివరించిన స్థిరాస్తులను **"ఎక్కడ ఎలా ఉన్నది అలానే" "ఏది ఎలా ఉంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది"** పద్ధతిపై తేది **13-03-2024**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత (లు) మరియు హామీదారు (లు) అయిన **1) శ్రీ జంజనం హేమ కిరణ్ ప్రసాద్,** తండ్రి : శ్రీమన్నారాయణ, డి.నెం. 4-220ఎ, గాంధీనగర్ వీధి, మంగళగిరి-522203, గుంటూరు జిల్లా (ఎ.పి). **శ్రీ జంజనం హేమ కిరణ్ ప్రసాద్,** తండ్రి : శ్రీమన్నారాయణ, డి.ఎన్.ఆర్. ఎన్‌క్లేవ్, 2-బిహెచ్‌కె ఫ్లాట్ నెం. 305, రెండవ అంతస్తు, ఆర్.ఎస్.నెం. 165/1, 172/3, ఆత్మకూరు గ్రామం & గ్రామ పంచాయితీ, మంగళగిరి మండలం, మంగళగిరి సర్వీస్ రోడ్డు, గుంటూరు జిల్లా (ఎ.పి). **2) శ్రీ జంజనం సాయి కిరణ్,** తండ్రి : శ్రీ జంజనం హేమ కిరణ్ ప్రసాద్, డి.నెం. 4-220ఎ, గాంధీనగర్ వీధి, మంగళగిరి-522203, గుంటూరు జిల్లా (ఎ.పి). **శ్రీ జంజనం సాయి కిరణ్,** తండ్రి : శ్రీ జంజనం హేమ కిరణ్ ప్రసాద్, డి.ఎన్.ఆర్. ఎన్‌క్లేవ్, 2-బిహెచ్‌కె ఫ్లాట్ నెం. 305, రెండవ అంతస్తు, ఆర్.ఎస్.నెం. 165/1, 172/3, ఆత్మకూరు గ్రామం & గ్రామ పంచాయితీ, మంగళగిరి మండలం, మంగళగిరి సర్వీస్ రోడ్డు, గుంటూరు జిల్లా (ఎ.పి).

ఈ వేలం విధానం ద్వారా విక్రయించడానికి ఉద్దేశించిన ఆస్తియొక్క నిర్థిష్ట వివరాలు క్రింద ఇవ్వబడినవి.

స్థిరాస్థి వివరములు

గుంటూరు జిల్లా (ఎ.పి.) మంగళగిరి సర్వీస్ రోడ్డు, మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం. 165/1, 172/3 వద్ద గల డి.ఎన్.ఆర్. ఎన్‌క్లేవ్ నందు రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం. 305కి చెందిన 2 బెడ్ రూమ్ నివాస ఫ్లాట్. **స్థలము హద్దులు : మొత్తం విస్తీర్ణం 1484.00 చ॥గ॥లు లేదా 1240.80 చ॥మీ॥ (అవిభక్త వాటా : 40.00 చ॥గ॥లు లేదా 33.45 చ॥మీ॥లు) తూర్పు :** బైపాస్ రోడ్డు - 63.60 అ॥, **దక్షిణం :** దామర్ల శివ వెంకట రాజు గారి ఆస్తి - 250.30 అ॥, **పడమర :** గుమ్మడి నాగేశ్వరరావు గారి ఆస్తి - 48.90 అ॥, **ఉత్తరం :** వీసరపు వెంకటేశ్వరమ్మ గారి ఆస్తి - 284.60 అ॥, **ఫ్లాట్‌కి హద్దులు : : ఫ్లాట్ నెం. 305, 2వ అంతస్తు, ప్లింత్ ఏరియా 1088.00 చ॥అ (కామన్ ఏరియాతో కలిపి) పార్కింగ్ ఏరియా 100.00 చ॥అ॥. హద్దులు : తూర్పు :** ఫ్లాట్ నెం. 306 & శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **పడమర :** కారిడార్ & ఫ్లాట్ నెం. 304, **ఉత్తరం :** కామన్ కారిడార్.

ఇంతకముందు తాకట్టు రుణభారాలు : లేవు	రిజర్వుధర : రూ. 28,21,000/-
ధరావత్తు : 2,82,000/-	బిడ్ పెంపుదల మొత్తం : 10,000/-
ఈ-వేలం తేది మరియు సమయం : 13-03-2024 - ఉ. 10 గం. నుండి సా. 5 గం.లకు	
ప్రాపర్టీ ఐడి నెం. : IDIB6464644820	

బిడ్డరు దారులు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ MSTC Ltd వారి వెబ్‌సైట్‌ను సందర్శించి (www.mstcecommerce.com) వేలం నందు పాల్గొదలచినవారు టెక్నికల్ సహాయం కొరకు MSTC హెల్ప్‌డెస్క్ వారి నెంబరు 033-22901004 మరియు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్లు సర్వీసు ప్రొవైడర్లు హెల్ప్‌డెస్క్ నందు అందుబాటులో కలవు. రిజిస్ట్రేషన్‌సౌలభ్యం కొరకు MSTC Ltd Mail ID : ibapiop@mstcecommerce.com మరియు ధరావత్తు స్థితిని తెలుసుకొనుటకు ఈ క్రింది Email ID : ibapifin@mstcecommerce.com వారిని సంప్రదించగలరు.

ఆస్తి వివరాలు, ఆస్తికి సంబంధించిన ఫోటోలు మరియు వేలం నియమ నిబంధనలు కొరకు https://ibapi.in ను సంప్రదించవలసిన వారు మరియు పోర్టల్‌కు సంబంధించిన వివరణల కొరకు హెల్ప్ లైన్ నెంబర్లు : 18001025026, 011-41106131.

బిడ్డర్లు ఆస్తికి సంబంధించిన పైన తెలుపబడిన ఐడి నెంబరు ఉపయోగించి వెబ్‌సైట్ https://ibapi.in మరియు www.mstcecommerce.com నందు సంప్రదించగలరు.

తేది : 14-02-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ ఇండియన్ బ్యాంక్

రాజ్యాంగ పరిరక్షణకై 29న యువజన ర్యాలీ

- యువజన సంఘాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, ఉపాధి హామీని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ నెల 29న ఢిల్లీలో ర్యాలీ నిర్వహించాలని 11 యువజన సంఘాల సంయుక్త సమావేశం నిర్ణయించింది. మార్చి 3న హర్యానాలోనూ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం ప్రాంతీయ స్థాయిలో దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించనున్నారు. గురువారం నాడిక్కడ కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో స్థానికంగా పనిచేసే మరిన్ని యువజన సంఘాలను చేర్చడం ద్వారా అసోసియేషన్‌ను విస్తరించాలని నిర్ణయించారు. డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ ఎంపి ఎఎ రహీమ్, ప్రధాన కార్యదర్శి హిమగ్నరాజ్ భట్టాచార్య, యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బివి శ్రీనివాస్, ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు సుఖ్జీందర్, ప్రధాన కార్యదర్శి ఆర్ తిరుమలై, నేషనలిస్ట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ధీరజ్ శర్మ మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్ వాదీ పార్టీ, ఆర్‌జెడి, ముస్లిం లీగ్, సిపిఐ ఎంఎల్, ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల యువజన విభాగం బాధ్యులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో 32 మందికే సర్కారు కొలువులు !

- రెండేళ్లలో బిజెపి ప్రభుత్వం సాధించిన 'ప్రగతి'

అహ్మదాబాద్ : సంవత్సరానికి రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని నరేంద్ర మోడీ ప్రభుత్వం గతంలో హామీలు గుప్పించింది. ప్రధాని సొంత రాష్ట్రంలోనే ఆ హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఆ రాష్ట్రంలో ఉద్యోగాల కోసం 2.38 లక్షల మంది విద్యావంతులైన నిరుద్యోగులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల కాలంలో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చిందో తెలుసా? అక్షరాలా 32 మందికి మాత్రమే. శాసనసభలో కాంగ్రెస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ఇది. రాష్ట్రంలోని 29 జిల్లాల్లో 2,38,978 మంది నిరుద్యోగులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వీరు కాకుండా 10,757 మంది పాక్షిక విద్యావంతులు కూడా పేర్లు నమోదు చేసుకున్నారని ప్రభుత్వం వివరించింది. అంటే పేర్లు నమోదు చేసుకున్న మొత్తం నిరుద్యోగుల సంఖ్య 2,49,735. వీరిలో 32 మందికి మాత్రమే సర్కారు కొలువులు లభించాయి. 22 మంది అహ్మదాబాద్, తొమ్మిది మంది భావనగర్, ఒకరు గాంధీనగర్‌లో ఉద్యోగాలు పొందారు. ఆనంద్ జిల్లాలో అత్యధికంగా 21,633 మంది నిరుద్యోగులు ఉండగా వడోదరలో 18,732 మంది, అహ్మదాబాద్‌లో 16,400 మంది ఉన్నారని రాష్ట్ర పరిశ్రమల మంత్రి బల్వంత్‌సింగ్ రాజ్‌పుత్ శాసనసభకు తెలియజేశారు.

అన్ని తండాల్లో ప్రభుత్వ బడులు

- సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో తెలంగాణ సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని గిరిజన తండాల్లో ప్రభుత్వ పాఠశాలలు నిర్మిస్తామని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీలుగా మారిన అన్ని తండాలకు బిటి రోడ్లు వేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, వైద్యం.. ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గాల్లోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వసతి గృహాల్లో అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చదువుకుంటేనే సమాజంలో గౌరవం ఉంటుందనీ, యువత అంతా సంత్ సేవాలాల్ మార్గంలో నడవాలని కోరారు. హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో గురువారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి మాట్లాడారు. 1976లో బంజారాలను ఎస్‌టి జాబితాలో ఇందిరాగాంధీ చేర్చారని గుర్తు చేశారు. దొరల రాజ్యం పోవాలి.. పేదల రాజ్యం రావాలని ప్రజలందరూ నినదించారు కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. సేవాలాల్ జయంతిని ఆప్షనల్ హాలీడేగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు రూ. రెండు కోటు కేటాయించామనీ, దీనికి సంబంధించిన జీవోను తక్షణమే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

22 వరకూ హేమంత్ సోరెన్‌కు కస్టడీ పొడిగింపు

రాంచీ : మనీలాండరింగ్ కేసులో ఇడి అరెస్టు చేసిన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఈ నెల 22 వరకూ జ్యుడిషియల్ కస్టడీని పిఎంఎల్‌ఎ ప్రత్యేక కోర్టు గురువారం పొడిగించింది. ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి తరపున న్యాయవాది, అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ విలేకరులకు తెలిపారు. హేమంత్ సోరెన్‌పై మనీలాండరింగ్ కేసును ఇడి విచారిస్తున్న సంగతి తెలిసిందే. జనవరి 31న రాత్రి సోరెన్‌ను ఇడి అధికారులు అరెస్టు చేశారు.

మారని కేంద్రం తీరు

(మొదటి పేజీ తరువాయి)

తప్పించుకునే ప్రయత్నం చేసింది. అందువల్ల చర్చలు ఆ స్థాయిలో ముందుకు సాగలేదు. లెక్కల విషయంలో కూడా భిన్నాభిప్రాయాలు వచ్చాయి. రానున్న రోజుల్లో విధానపరమైన అంశాల్లో కేంద్రం వైఖరిలో మార్పు వస్తుందేమో చూడాలి. తక్షణ ఉపశమనంగా మంజూరు చేయగల అత్యంత సహేతుకమైన విషయాలపై ప్రత్యేక పిటిషన్ వేయబడింది. ఆ విషయంలోనూ అనుకూల పరిస్థితి లేదు. కోర్టును ఆశ్రయించినందుకు కేంద్రం కేరళపై ద్వేషం పెంచుకోవాల్సిన అవసరం లేదు. ఇది ఇగో సమస్య కాదు. కేంద్రం, రాష్ట్రాలు సోదరభావంతో మెలగాలి. అదే కో-ఆపరేటివ్ ఫెడరలిజం. ఈ అంశం కోర్టు పరిశీలనలో ఉన్నందున ఎక్కువ చెప్పదలచుకోలేదు' అని కెఎన్ బాలగోపాల్ తెలిపారు.

ప్రజా కోర్టులోనూ బిజెపిని ఓడిస్తాం

- కేంద్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి గ్రామీణ బంద్ జయప్రదం చేస్తాం
- ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నల్లధనాన్ని నివారించే పేరుతో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల బాండ్లు సేకరించాలని తెచ్చిన విధానాన్ని రద్దు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నామని జాతీయ కిసాన్ సభ నేత హన్నన్ మొల్లా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. గురువారం నాడిక్కడ ఎపి, తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి ఊపిరి ఇచ్చినట్లుగా ఉందని అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్రప్రభుత్వ నిర్ణయం ఉందని సర్వోన్నత న్యాయస్థానమే వ్యాఖ్యానించిందని, ఈ తీర్పుతో బిజెపి కార్పొరేట్ల పార్టీ అని తేలిందని అన్నారు. ఓట్లను కొనుగోలు చేయడానికి ఎన్నికల బాండ్ల పేరుతో బిజెపికి కార్పొరేట్లు వేల కోట్ల రూపాయల నిధులను సిద్ధం చేశారని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల ప్రజా కోర్టులోనూ మోడీ ప్రభుత్వాన్ని ఓడిస్తామని

మీడియాతో మాట్లాడుతున్న వెంకట్, హన్నన్ మొల్లా

తెలిపారు. బిజెపి పదేళ్ల క్రితం నుంచి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే పోలీసు, పారా మిలటరీ దళాలను పెట్టి, రోడ్లపై మేకులు కొట్టి, కంచెలు వేసి రైతులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఇంటర్నెట్ బంద్ చేసి, లాఠీఛార్జ్ చేస్తున్నారని, వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో న్యాయ సమ్మతమైన డిమాండ్స్ కోసం ఆందోళన చేస్తున్న రైతులపై మోడీ ప్రభుత్వం నిరంకుశత్వం ప్రదర్శిస్తూ కాశ్మీరీలపై వాడిన పెల్లెట్స్ వాడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు శుక్రవారం గ్రామీణ భారత్ బంద్ నిర్వహిస్తున్నాయని, సెక్టోరియల్ సమ్మెలో ట్రేడ్ యూనియన్లు పాల్గొంటున్నాయని చెప్పారు. మోడీ ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. 21 డిమాండ్ల కోసం రైతులు పోరాడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ బడ్జెట్ 2 లక్షల కోట్లకు పెంచాలని, వేతనాలు పెంచాలని, ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్స్ ఈ బంద్‌లో ఉన్నాయని వారు తెలిపారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా ఆయనకు భారతరత్న ప్రకటించడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయన్నారు. ఆయన కుమార్తె, ఆర్థిక వేత్త మధుర స్వామినాథన్ రైతులకు సి2 ప్లస్ 50 శాతం ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని, రైతుబీమా వంటి పథకాల ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చాలని కోరారన్నారు. అలా చేసినప్పుడు మాత్రమే ఆయనకిచ్చిన భారతరత్న లక్ష్యం నెరవేరుతుందని తేల్చిచెప్పారు. నేడు గ్రామీణ బంద్ విచ్ఛిన్నం చేయడానికి బిజెపి చర్చలు, మంత్రుల కమిటీ పేరుతో కాలయాపన చేస్తుందని, ఎన్ని ప్రయత్నాలు చేసినా శుక్రవారం గ్రామీణ బంద్‌ను రైతులు, వ్యవసాయ కార్మికులు విజయవంతం చేస్తారని తెలిపారు. మీడియా సమావేశంలో కిసాన్ సభ జాతీయ కమిటీ సభ్యులు మనోజ్ పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్లలో బిజెపికే అగ్రస్థానం

- కమలం పార్టీకి రూ.6,566 కోట్లు
- కాంగ్రెస్‌కి రూ.1,123 కోట్లు
- వైసిపికి రూ.382 కోట్లు, టిడిపికి రూ.146 కోట్లు
- బాండ్ల ద్వారా విరాళాలు స్వీకరించని ఏకైక పార్టీ సిపిఎం

రాజకీయ పార్టీ	విరాళాలు (కోట్లల్లో)
బిజెపి	రూ.6,566
కాంగ్రెస్	రూ.1,123
టిఎంసి	రూ. 1,092
బిజెడి	రూ. 774
డిఎంకె	రూ.616
టిఆర్ఎస్	రూ.383
వైసిపి	రూ.382
టిడిపి	రూ.146
శివసేన	రూ.101
ఆప్	రూ.94
ఎన్‌సిపి	రూ.63
ఎస్‌పి	రూ.49
జెడియు	రూ.24
జెడిఎస్	రూ.13
ఎస్ఎడిల	రూ.7
అన్నాడిఎంకె	రూ.6
ఆర్‌జెడి	రూ.2.5
జెఎంఎం	రూ.1
ఎస్‌డిఎఫ్	రూ.0.5
ఎంజిపి	రూ.0.05
మొత్తం	**రూ.8,970**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బిజెపికి రూ.6,566 కోట్లు విరాళాలు వచ్చాయి. ఎన్నికల బాండ్లు 2017-18లో అమలు చేయగా, ఇప్పటి వరకు 20 జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలకు రూ.8,970 కోట్లు వచ్చాయి. అందులో అగ్రభాగం బిజెపికే దక్కాయి. కాంగ్రెస్‌కి రూ.1,123 కోట్లురాగా, టిఎంసికి రూ. 1,092 కోట్లు, బిజెడికి రూ. 774 కోట్లు, డిఎంకెకి రూ.616 కోట్లు వచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లో వైసిపికి రూ.382 కోట్లు, టిడిపికి రూ.146 కోట్లు, టిఆర్ఎస్ కి రూ.383 కోట్లు వచ్చాయి. సిపిఎం ఒక్కటే ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు స్వీకరించలేదు.

54 శాతానికి పైగా ఎలక్టోరల్ బాండ్లు రూ.1 కోటి విలువలో విక్రయించారు. ఆ తర్వాత రూ.10 లక్షలు, రూ.1 లక్ష, అంతకంటే తక్కువ ఉన్నాయి.

హింసాకాండకు వ్యతిరేకంగా మణిపూర్ మహిళల నిరసన

ఇంఫాల్ : మణిపూర్‌లో గత తొమ్మిది నెలలుగా కొనసాగుతున్న హింసాకాండకు వ్యతిరేకంగా ఆ రాష్ట్రంలో మహిళలు వీధుల్లోకి వచ్చారు. గ్రామాలపై సాయుధులు చేస్తున్న దాడులకు వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ప్రధానంగా ఇంఫాల్‌లోని ఐదు జిల్లాల్లో పౌర సంఘం పీపుల్స్ అలయన్స్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్ మణిపూర్ నేతృత్వంలో మహిళలు ఈ నిరసనలు నిర్వహించారు. మణిపూర్ ప్రాదేశిక, పరిపాలనా, సమగ్రతను పరిరక్షించాలని మహిళలు నినాదాలు చేశారు. గ్రామస్థులను లక్ష్యం చేసుకుని సాయుధ దుండగులు చేస్తున్న దాడులను ఖండించారు. సాయుధులకు ఆయుధాలు, మందుగుండు సామాగ్రి లభించడంపై కేంద్రం, దాని దర్యాప్తు సంస్థలు దృష్టి పెట్టాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ కారణంగానే గ్రామాలపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. గత ఏడాది మే నుంచి మణిపూర్‌లో హింసాకాండ చెలరేగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం కూడా కక్చింగ్ జిల్లాలోని సుగ్ను గ్రామంపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు.

ఆయుధాలు దోచుకున్న ఘటనలో ఆరుగురి అరెస్టు

మణిపూర్ రైఫిల్స్ ఆయుధాగారం నుంచి ఆయుధాలు, మందుగుండు చోరీ చేసిన ఘటనలో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు గురువారం వెల్లడించారు. నిందితుల నుంచి నాలుగు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎకె ఘటక్-2, సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్‌తో కూడిన కొన్ని మ్యాగజైన్లు, 9 ఎంఎం మందుగుండు సామాగ్రి ఉన్న 16 చిన్న పెట్టెలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సాయుధులతో వీడియో.. హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఒక వీడియోలో సాయుధ దుండగులతో కలిసి కనిపించిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌ను మణిపూర్ అధికారులు సస్పెండ్ చేశారు. చురచంద్‌పూర్ జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ సియామ్‌లాల్‌పాల్ ఇటీవల సాయుధ వ్యక్తులతో కలిసి ఒక వీడియోలో కనిపించారు. ఇది దుష్ప్రవర్తనకు సమానంగా అధికారులు భావిస్తూ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు జిల్లా ఎస్‌పి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ముందస్తు అనుమతి లేకుండా స్టేషన్ వదిలి వెళ్లవద్దని ఆదేశించారు.

అండగా ఉంటాం

- అనరుల్ ఇస్లాం కుటుంబానికి సిపిఎం పరామర్శ
- పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ పోలీసుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన వామపక్ష కార్యకర్త అనరుల్ ఇస్లాం కుటుంబాన్ని సిపిఎం నాయకులు గురువారం పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం నేతృత్వంలోని సిపిఎం నాయకుల బృందం ఇస్లాం కుటుంబాన్ని పరామర్శించింది. ఈ సందర్భంగా ఇస్లాం కుటుంబ సభ్యులతో కలిసి మహమ్మద్ సలీం విలేకరులతో ఇస్లాం మరణానికి కారణమైన పోలీసులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సిఐటియు, ఎఐకెఎస్ పిలుపు మేరకు ఈ నెల 13న పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా శాసనోల్లంఘన కార్యక్రమాలను నిర్వహించారు. ముర్షిదాబాద్ జిల్లా బర్హంపూర్‌లో శాంతియుతంగా శాసనోల్లంఘన కార్యక్రమం నిర్వహిస్తున్న వారిపై పోలీసులు కాల్పులు జరపడంతో అనరుల్ ఇస్లాం ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల అణచివేతతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 మంది గాయపడ్డారు. బర్హంపూర్‌లో గాయపడిన వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ శాసనోల్లంఘన కార్యక్రమంలో మరో 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని బుధవారం కోర్టులో ప్రవేశపెట్టారు. రెండు రోజుల నుంచి వీరు పోలీసుల అదుపులోనే ఉన్నారు.

కాగా, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులపై పోలీసులను ప్రయోగించిన పశ్చిమ బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై దాడికి పాల్పడుతున్న కేంద్రం, హర్యానాలోని బిజెపి ప్రభుత్వాలను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విరుచుకుపడుతున్నారని, అయితే రాష్ట్రంలోని రైతులపై ఆమె అదే విధంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం, ఇతర వామపక్ష నాయకులు విమర్శిస్తున్నారు.

అనరుల్ ఇస్లాం కుటుంబాన్ని పరామర్శిస్తున్న సలీం తదితరులు

ఒంటరిగానే పోటీ చేస్తాం

- ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్ : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేయనున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తెలిపారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీట్ల పంపకానికి సంబంధించినంత వరకు, ఎన్‌సి ఒంటరిగానే పోటీ చేస్తుందని చెప్పారు. ఆ విషయంలో ఎలాంటి సందేహం లేదని స్పష్టం చేశారు. క్రికెట్ కుంభకోణం ఆరోపణలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఫరూక్ అబ్దుల్లాకు సమన్లు జారీ చేసిన కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. జమ్ముకాశ్మీర్ ఎన్నికలపై మీడియా ప్రశ్నకు స్పందిస్తూ.. పార్లమెంటరీ ఎన్నికలతో పాటే రెండు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరుగుతాయని తాను భావిస్తున్నానని చెప్పారు.

ఎంపి పదవికి టిఎంసి నేత మిమిచక్రవర్తి రాజీనామా

కోల్‌కతా : నటి, తృణమూల్ కాంగ్రెస్ నేత మిమి చక్రవర్తి ఎంపి పదవికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. స్థానిక నేతలతో విభేదాల కారణంగానే పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. రాజీనామా లేఖను టిఎంసి అధ్యక్షురాలు మమతా బెనర్జీకి పంపినట్లు తెలిపారు. జాదవ్‌పూర్ అభివృద్ధి కోసం కలలు కన్నానని, స్థానిక నేతల నుండి ఇబ్బందులను ఎదుర్కొన్నానని అన్నారు. సినిమా ఇండస్ట్రీ నుండి వచ్చిన వ్యక్తి పనికి రారు అంటూ అపఖ్యాతిపాలు చేయడం చాలా సులభమని అన్నారు. బెంగాల్ చిత్ర పరిశ్రమలో ప్రముఖ నటి అయిన మిమి 2019 లోక్‌సభ ఎన్నికల్లో జాదవ్‌పూర్ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఆమె బిజెపి అభ్యర్థి అనుపమ్ హజ్రాపై సుమారు 2,95,000 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

ఇండోనేషియా ఎన్నికల్లో సుబియాంటోకు భారీ ఆధిక్యం

జకార్తా : అధ్యక్ష ఎన్నికల్లో ఇండోనేషియా రక్షణ మంత్రి ప్రబౌ సుబియాంటో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అనధికారిక ఫలితాల మేరకు ప్రత్యర్థులపై ఆయన గణనీయమైన ఆధిక్యాన్ని చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. శీఘ్రగణన బ్యాలెట్ల ఆధారంగా ప్రబౌ సుబియాంటోకు దాదాపుగా 58 శాతం ఓట్లు పోలైనట్లు స్వతంత్ర పోస్టలర్స్ తెలిపారు. ఎన్నికల సంఘం ప్రాథమిక లెక్కింపు నెమ్మదిగా కొనసాగుతోందని, ప్రబౌకు 57.7 శాతం ఓట్లు నమోదు కాగా, ప్రత్యర్థులు అనిస్ బస్వెదన్, గంజర్ ప్రనోవ్‌లు వరుసగా 25 శాతం, 17 శాతంతో వెనుకబడ్డారని తెలిపారు. దేశవ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో నమూనా ఓట్ల ఆధారంగా శీఘ్రగణన జరుగుతుంది. ఇండోనేషియాలో ఓట్ల లెక్కింపు సుదీర్ఘ ప్రక్రియ. అధికారిక ఫలితాల వెల్లడికి దాదాపు నెల రోజుల వరకు సమయం పట్టొచ్చు. 2004 నుంచి జరిగిన ప్రతి అధ్యక్ష ఎన్నికలోనూ శీఘ్రగణన అంచనాల ఆధారంగానే తుది ఫలితాలొచ్చాయి. అధ్యక్ష ఎన్నికల్లో తాను విజయం సాధించినట్లు ప్రబౌ సుబియాంటో ప్రకటించారు. జకార్తాలోని ఓ స్టేడియంలో మద్దతుదారులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అత్యుత్సాహం కూడదని, వినయంగా ఉండాలని, ఈ విజయం దేశ ప్రజలందరి విజయం కావాలని అన్నారు. శీఘ్ర గణన ఫలితాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు మాజీ అధ్యక్షుడు జొకొ విడొడొ కుమారుడు జిబ్రన్ రకబుమింగ్ రాకా కూడా ఉన్నారు.

లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి

- హిజ్బుల్లా కమాండర్ సహా 10మంది మృతి

బీరుట్ : దక్షిణ లెబనాన్‌లోని నబతియె నగరంపై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడిలో హిజ్బుల్లా కమాండర్‌తో సహా పది మంది మరణించారు. మృతుల్లో ఏడుగురు పౌరులు కూడా వున్నారని భద్రతా వర్గాలు తెలిపాయి. బుధవారం నాటి దాడిలో కూడా ముగ్గురు పౌరులు చనిపోయారు. సావానెహ్‌లో ఒక ఇంటిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు జరిపిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. గాజాలో ఇజ్రాయిల్ యుద్ధం ఆరంభమైన తర్వాత లెబనాన్‌లో ఇంతమంది సామాన్యులు మరణించడం ఇదే. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్, హిజ్బుల్లా మధ్య ఘర్షణలు మరింత విస్తరించగలవన్న ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నెల 8న డ్రోన్ దాడి జరిగిన సమయంలో హిజ్బుల్లా కమాండర్ అలీ అల్ దెబ్స్‌ను లక్ష్యంగా చేసుకుని గాయపరిచారు. తాజా దాడిలో చనిపోయాడని ఆ వర్గాలు తెలిపాయి. కమాండర్‌తోపాటూ వున్న మరో ఇద్దరు హిజ్బుల్లా కార్యకర్తలు కూడా ఈ దాడిలో చనిపోయారు.

రఫాను వీడుతున్న పాలస్తీనియన్లు

గాజా : ఇజ్రాయిల్ బలగాలు వైమానిక, భూతల దాడులను పెంచడంతో గతంలో 'సురక్షిత నగరం'గా పరిగణించిన దక్షిణ నగరం రఫా నుండి కూడా పాలస్తీనియన్లు తరలివెళుతున్నారు. దాడులు ఉధృతమైన నేపథ్యంలోనే ప్రాణ భయంతో రఫా నుండి పారిపోతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆస్పత్రిలో చిక్కుకుపోయిన వారు కూడా అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. సోమవారం రాత్రి ఆస్పత్రిని ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించిన కొద్దిసేపటికే ఇజ్రాయిల్ దళాలు స్నిపర్ (పొంచి వుండి జరిపే) దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో 67 మంది మరణించినట్లు పాలస్తీనియన్ వైద్య అధికారులు తెలిపారు. ఆ సమయంలో డజన్లసంఖ్యలో ప్రజలు ఆసత్రిలో చిక్కుకుపోయారని తెలిపారు. అనంతరం 14 నివాసాలు, మూడు మసీదులపై కూడా సైన్యం దాడులు జరిపింది. ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో 28,576 మంది పాలస్తీనియన్లు మరణించగా, సుమారు 68,291 మంది గాయపడినట్లు అధికారులు ప్రకటించారు. ప్రాణభయంతో పరుగులు తీస్తున్న వారిపై ఇజ్రాయిల్ దళాలు దాడికి దిగడాన్ని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా తీవ్రంగా ఖండించాయి. ఇకనైనా ఇజ్రాయిల్ తన మిత్రులు, అంతర్జాతీయ సమాజం ఇచ్చే సూచనలను పాటించాలని ఆయా దేశాల నేతలు పేర్కొన్నారు.

ఎవరేమన్నారు?

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీం కోర్టు వెలువరించిన చారిత్రక తీర్పును ప్రతిపక్షాలు స్వాగతించగా, అధికార పార్టీ బిజెపి ఆచితూచి స్పందించింది.

చారిత్రాత్మక తీర్పు : సిపిఎం

ఎలక్టోరల్ బాండ్ల స్కీము రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును సిపిఎం పొలిట్‌బ్యూరో ఎంతగానో కొనియాడింది. పాలక పార్టీకి అజ్ఞాత కార్పొరేట్ దాతలు నిధులు అందించేందుకు వీలుకల్పించేలా రూపొందించిన ఈ దిక్కుమాలిన పథకం నేటి సుప్రీం తీర్పుతో పూర్తిగా రద్దయిందని పేర్కొంది. అవినీతిని చట్టబద్ధం చేస్తున్న ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని తాము ఆమోదించే ప్రసక్తే లేదని సిపిఐ(ఎం) మొదటి నుంచి చెబుతూవస్తోంది. ఇతర పిటిషనర్లతో కలిసి సిపిఎం ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీం కోర్టులో సవాలు చేసింది. ఈ పథకానికి వ్యతిరేకంగా పిటిషనర్లు చేసిన ప్రధాన వాదనలను సుప్రీంకోర్టు సమర్థించినందుకు సంతోషంగా వుందని వ్యాఖ్యానించింది. రాజకీయపార్టీలకు అందే నిధులు పారదర్శకంగా, స్వచ్ఛంగా ఉండేలా చూసేందుకు, అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయ, ఎన్నికల నిధుల సమీకరణ నిబంధనల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచే తీర్పు : ఆర్‌జెడి

" " కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తనకు లబ్ధి చేకూరేలా ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఇప్పుడు సుప్రీం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరుస్తుంది

- తివారీ, ఆర్‌జెడి ప్రతినిధి

బిజెపికి గట్టి ఎదురుదెబ్బ : తృణమూల్

'ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టిన అధికార బిజెపికి ఈ తీర్పు పెద్ద ఎదురు దెబ్బ. నిధుల విషయంలో పారదర్శకత వుండాలనే మేము చెబుతున్నాం"

-కునాల్ ఘోష్ , తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధి

చారిత్రాత్మకం : మాజీ ఎన్నికల ప్రధానాధికారి

'సుప్రీం తీర్పు చారిత్రకం. పరిశుద్ధమైన ప్రజాస్వామ్య ప్రయోజనాల రీత్యా ఇది చాలా కీలకమైన తీర్పు. ఈ తీర్పుతో పూర్తిగా ఏకీభవిస్తున్నా. రాజకీయ పార్టీలు దీన్నుండి పాఠాలు నేర్చుకోవాలి"

- మాజీ చీఫ్ ఎన్నికల కమిషనర్ టి.ఎస్.కృష్ణమూర్తి

స్వాగతిస్తున్నాం: అన్నాడిఎంకె

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం.బాండ్ల ద్వారా భారీ మొత్తాలు అందుకున్న పార్టీలు మమ్మల్ని నొక్కేశాయి. వారి ధన బలంతో మమ్మల్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. కచ్చితంగా ఈ తీర్పును స్వాగతిస్తున్నాం."

- కె.పళనిసామి, అన్నాడిఎంకె చీఫ్

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

(క్విడ్ ప్రోకోకు) కూడా ఇది వీలు కల్పిస్తోంది. అంతేకాదు ప్రత్యర్థి పార్టీకి విరాళాలు అందకుండా అడ్డుకోవడానికి ఈ బాండ్ల విధానంలో నిబంధనలున్నాయి. 2018 నుండి ఈ ఏడాది ప్రారంభం వరకూ రూ.16,518 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను ఎస్‌బిఐ విక్రయించిందని ప్రభుత్వం ఇటీవల పార్లమెంటుకు తెలియజేసింది. తాజాగా జనవరి 2-11 తేదీల మధ్య రూ.570 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్ల విక్రయం జరిగింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని కాంగ్రెస్ నేత జయా ఠాకూర్, సిపిఐ (ఎం), ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఎడిఆర్) సుప్రీంకోర్టులో సవాలు చేశాయి. ఈ కేసులో సుప్రీంకోర్టు గత సంవత్సరం మూడు రోజుల పాటు వాదనలు విన్నది. నవంబర్ 2న తీర్పున రిజర్వ్ చేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్ అందజేసిన సమాచారం ప్రకారం 2016-2022 మధ్య రూ.16,437.63 కోట్ల విలువైన 28,030 ఎన్నికల బాండ్లను విక్రయించారు. వీటిలో అత్యధికంగా బిజెపి రూ.10,122 కోట్ల విరాళం పొందింది. ప్రతిపక్ష కాంగ్రెస్‌కు రూ.1,547 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.823 కోట్లు అందాయి. జాబితాలోని 30 పార్టీలకు కలిపి ఎంత విరాళం అందిందో దాని కంటే ఎక్కువ విరాళం బిజెపికే అందడం గమనార్హం.

52ఏళ్ల తర్వాత చంద్రునిపై అమెరికా పరిశోధనలు

- ప్రైవేట్ మూన్ ల్యాండర్ ప్రయోగం

కేప్ కేన్వరాల్ : అపోలో మిషన్స్ తర్వాత అర్ధ శతాబ్దానికి పైగా సుదీర్ఘ విరామం అనంతరం అమెరికా, చంద్రుని ఉపరితలంపై పరిశోధనలు చేసేందుకు ప్రైవేట్ మూన్ ల్యాండర్‌ను పంపించింది. గురువారం తెల్లవారుజామున కేప్ కేన్వరాల్‌లోని కెనడీ స్పేస్ సెంటర్ నుండి ఒడిసెస్ ల్యాండర్‌ను తీసుకుని స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి ఎగిసింది. ప్రైవేటు కంపెనీ రూపొందించిన అంతరిక్ష నౌకతో ఈ ప్రయోగాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి. ఇప్పటివరకు అమెరికా, రష్యా, చైనా, భారత్, జపాన్ మాత్రమే చంద్రునిపై ల్యాండ్ అయ్యాయి. ఏ ప్రైవేటు సంస్థ కూడా ఈ ప్రాజెక్టును చేపట్టలేదు. హ్యూస్టన్‌లోని ఏరోస్పేస్ కంపెనీ అయిన ఇంటుటివ్ మెషిన్స్ 3,70,000 కిలోమీటర్ల దూరంలోని గమ్యాన్ని చేరుకునేందుకు ఈ మూన్ ల్యాండర్‌ను రూపొందించింది. ప్రత్యర్థి కంపెనీ ఆస్ట్రోబొటిక్ టెక్నాలజీ రూపొందించిన లూనార్ ల్యాండర్‌ను ప్రయోగించిన పది రోజుల తర్వాత భూమికి తిరిగి వచ్చేటప్పుడు దగ్ధమై పసిఫిక్ సముద్రంలో కుప్పకూలింది. ఆ ఘటన జరిగిన నెల రోజుల తర్వాత ఈ మూన్ ల్యాండర్ ప్రయోగం జరిగింది.

రాజధాని పేదలకు పింఛను పెంపు

(మొదట పేజీ తరువాయి)

మరో రూ.లక్షా 26 వేల కోట్లు ఖర్చు అవుతాయన్నారు. ఎలాగూ ఇచ్చేది లేదని, అందువల్ల ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు అనేక విధాలుగా మభ్యపెడతారని, ఆయనను నమ్మద్దని ప్రజలకు జగన్ పలుమార్లు విజ్ఞప్తి చేశారు. వలంటీర్ల వ్యవస్థ అంటే చంద్రబాబుకు కడుపు మంటని, చంద్రబాబుకు ఓటు వేయడం అంటే ఐదేళ్ల క్రితం వదిలించుకున్న చంద్రముఖిని మళ్లీ ఇంటికి పిలిపించుకోవడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇవాల్టి నుంచి వారం రోజుల పాటు వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 875 మంది వలంటీర్లకు సేవా వజ్రా అవార్డులు, 4,150 మందికి సేవారత్న, 2,50,439 మందికి సేవా మిత్ర అవార్డులతో సన్మానం చేస్తున్నట్టు వివరించారు. ఫిరంగిపురం కొండపై ఉన్న కార్మెల్ మాతా ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం రూ.39 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. సభలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ఆదిమూలపు సురేష్, బి.ముత్యాలనాయుడు, అంబటి రాంబాబు, విడదల రజనీ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు అజయ్ జైన్, శ్రీలక్ష్మీ, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన ఉధృతం

(మొదట పేజీ తరువాయి)

నిరసనల నుండి వెనక్కి తగ్గవలసి వచ్చింది. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించిన మూడు వ్యవసాయ చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేయాల్సి వచ్చింది. పంటలకు కనీస ధర గ్యారెంటీ చేసే చట్టాన్ని తెస్తామని, 2021 విద్యుత్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకుంటామని రైతు ఉద్యమానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే, ఆ దిశగా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు మళ్లీ ఉద్యమించారు. . వరి, గోధుమలతో పాటు ఇతర పంటలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరారు. అంబాలాలోని శంభు సరిహద్దు ప్రాంతంలో రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైతులను ఢిల్లీలోకి రాకుండా అడ్డుకునేందుకు హర్యానాలోని బీజేపీ ప్రభుత్వ పోలీసులు విచక్షణారహితంగా టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నారు. కర్ర కదులుతోంది. టియర్ గ్యాస్ నిఘా కోసం డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. మేము ఈ దేశ ప్రజలమని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని గాయపడిన రైతులు నినదించారు.

అణచివేతకు 30 వేల టియర్ గ్యాస్ షెల్స్‌కు ఆర్డర్

ఈ రోజు రైతులను అణిచివేసేందుకు ఢిల్లీ పోలీసులు తమ కార్యకలాపాలను పెంచారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఈ దళం రైతులను నిలువరించేందుకు 30,000 టియర్ గ్యాస్ షెల్స్‌ను తెస్తోంది. పంజాబ్ నుండి వస్తున్న వేలాది మంది రైతుల్ని హర్యానా బోర్డర్ వద్ద ఆపేశారు. ఢిల్లీలోకి ప్రవేశించకుండా సింఘు, టిక్రి, గాజీపూర్ సరిహద్దు ప్రాంతాల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను నిర్మించారు. రోడ్లకు అడ్డంగా ముళ్ల తీగ, ఇనుప ప్రహరీకి భారీ కాంక్రీట్ స్లాబులు పెట్టారు.

పొలాలకు వెళ్లి పని చేయొద్దు : రాకేష్ తికాయత్ పిలుపు

గ్రామీణ బంద్ నేపథ్యంలో రైతులంతా శుక్రవారం పొలాల్లో పనులకు విరామం ఇచ్చి, బంద్, ఆందోళనల్లో పాల్గోవాలని భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు) నేత రాకేష్ తికాయత్ పిలుపునిచ్చారు. కార్మికులు కూడా సమ్మె చేస్తున్నారని, రైతుల ఆందోళనలకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు.

మీ కోసం

పకోడీ మిశ్రమంలో మిగిలిపోయిన అన్నం, గరం మసాలా, బ్రెడ్ వేసి బాగా కలుపుకుని పకోడీలు వేసుకుంటే కరకరలాడుతూ భలే రుచిగా ఉంటాయి.

జీవన సౌరభం

సమయం ఉన్నప్పుడు
మాట్లాడేది పరిచయం.
సమయం చేసుకుని
మాట్లాడేది బంధం..

నీవే స్ఫూర్తి ప్రదాత

చలి ముసుగు తొలగితే
రహదారి కనిపించు
మనసు ముసుగు తొలగితే
హృదయం వికసించు

కాల గమనంలో
కరిగిపోయిన రోజులు
ఆనంద జీవనానికి
నేర్పును పాఠాలు

ప్రతి మజిలీ లోను
మలుపులు ఉంటాయి
వ్యూహాత్మకంగ ఉంటే
సోపానాలవుతాయి

గడిచిన కాలం
జ్ఞాపకాల తీరం
భవిష్యత్ కాలం
అభివృద్ధికి దారం

నిర్ణయం మంచిదైతే
అతిగా ఆలోచించకు
ఎన్నడూ చెడు దిశగా
ప్రయాణం చేయమాకు
నిబద్ధతతోనే
నడక సాగించు
ఆత్మవిశ్వాసంతో
విజయం వరించు!

- మొర్రి గోపి,
కవిటి, శ్రీకాకుళం జిల్లా.
88978 82202.

గుణింత పదాలు నేర్చుకుందామా!

కా కి
క్రై ____
కో ____
కే ____
కీ ____
కృ ____
కా ____
కొం ____
కూ ____
కా ____

పిల్లలూ, ఇక్కడ 'క' గుణింతంలోని కొన్ని అక్షరాలు ఇచ్చాం. వాటికి 'క', 'కి','ర' 'పం', 'త్యం', 'రం', 'డ', 'లం' ఉపయోగించి అర్థవంతమైన పదాలు వచ్చేలా రాయండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

నేను గీసిన బొమ్మ

గోపాలపురం వైష్ణవి,
7వ తరగతి,
జక్కాపూర్,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నిరాశ్రయులను నిలబెడుతున్నాడు..

ప్రతి రోజూ మన చుట్టూ ఎంతోమంది నిరాశ్రయులు కనిపిస్తుంటారు. నిలువ నీడ లేక చెట్ల కింద, పుట్‌పాత్‌లపై నిద్రించేవారిని బోలెడుమందిని రోజూ చూస్తుంటాం. ఆ క్షణం ఆ వైపు చూపు తిప్పినా, మరు క్షణమే మన పనిలో బిజీ అయిపోతాం. మరి అటువంటి వారిని పట్టించుకునేది ఎవరు? వారికి ఆశ్రయం కల్పించేది ఎవరు?
నిధులు సేకరించి నిరాశ్రయులను ఆదరించే సంస్థలు చాలా ఉంటాయి. కానీ సొంత ఉత్పత్తులతో నిధులను సమీకరించుకుని సాయం చేసేవి చాలా తక్కువ. అటువంటి వాటిలో ఒకటే పుదుచ్చేరిలోని 'స్నేహన్'. సి.అనుముత్తు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆ సంస్థ ఆపన్నులకు ఆసరా ఇవ్వడమే కాక, ఆర్థికంగా ఎదిగేలా ఉపాధి మార్గాలు కూడా చూపిస్తోంది.

సంస్థ నిర్వాహకుడు అనుముత్తు పేదరిక కుటుంబం నుండి వచ్చారు. ఏడేళ్ల వయస్సులో తండ్రిని పోగొట్టుకున్న ఆయన చిన్న వయసులోనే బాలకార్మికునిగా పనిచేశాడు. 'అమ్మతో పాటు నేను రోజు కూలీకి వెళ్లిన రోజులు నాకు ఇప్పటికీ గుర్తే. అమ్మకు రోజుకు రూ.6, నాకు రూ.4 జీతం ఇచ్చేవారు. ఆ కొద్ది మొత్తంతోనే నేను, అమ్మ, చెల్లి, తమ్ముడు జీవించేవాళ్లం. పని లేనప్పుడు పస్తులతోనే గడిపేవాళ్లం. వేసవిలో పని దొరక్క చాలా రోజులు ఉండిపోయేవాళ్లం. ఆకలి తట్టుకోవడానికి చేలో వేరుశనగ గింజలు దొంగిలించడం కూడా నాకు ఇప్పటికీ గుర్తే' అంటూ తన చిన్ననాటి అనుభవాన్ని అనుముత్తు గుర్తుచేసుకున్నారు.

తినడానికి తిండి లేని కుటుంబం నుండి వచ్చిన అనుముత్తు ఇప్పుడు నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడం వెనుక గొప్ప ఆశయం దాగుంది. 'నేను ఉచిత భోజనం, బట్టలు కోసమే స్కూలుకి వెళ్లేవాడ్ని. కానీ రోజూ స్కూలుకి వెళితే అమ్మ ఒక్కత్తే పనికి వెళ్లాల్సివస్తుందని చదువు మధ్యలోనే ఆపేశాను. అటువంటి పరిస్థితుల్లో ఓ చర్చి ఫాదర్ నన్ను అక్కున చేర్చుకున్నాడు. చదువు చెప్పించాడు. బోర్డింగ్ స్కూల్లో విద్యాభ్యాసం పూర్తిచేసి, హైద్రాబాద్‌కి వెళ్లి ఐటిఐలో ఎలక్ట్రికల్ స్ట్రీమ్ నేర్చుకున్నాను. నాకు మల్టీమీడియా అంటే ఇష్టం. దీంతో తిరుచ్చికి తిరిగివచ్చి, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌గా శిక్షణ తీసుకున్నాను. ఈ ప్రయాణంలో నాకు ఎంతోమంది నిరాశ్రయులు తారసపడ్డారు. రోడ్డు మీద యాచన చేసేవారు, ఆహార పొట్లాల కోసం ఎదురుచూసే వాళ్లు, హోటల్లో పనిచేసే పిల్లలు ఇలా చాలామంది కనిపించేవారు. వారందరిలో నన్ను నేను చూసుకునేవాడ్ని. నాకు ఎవరో ఆశ్రయం ఇస్తే నేను ఈ స్థితికి వచ్చాను. కాబట్టి వీరికి కూడా ఇంకెవరో ఆసరా ఇస్తారు అని సర్దిపెట్టుకోలేకపోయాను. వారిలో కొంతమందినైనా నేను పడిన బాధలు పడకుండా చేయాలి అని గట్టిగా అనుకున్నాను. అందులో భాగంగానే 2008లో 'స్నేహన్' సంస్థను ప్రారంభించాను' అని సంస్థ ఆవిర్భావం వెనుక ఉన్న ఆశయాన్ని వివరించారు.

'స్నేహన్' ప్రత్యేకత ఏంటంటే.. నిధుల సేకరణ కోసం విద్యాసంస్థలతో అనుసంధానమై సొంతంగా పత్తి ఉత్పత్తులను విక్రయిస్తుంది. ఈ ఆదాయంతో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తోంది. 'ఆసరాగా నిలవడం అంటే వారికి ఆహారం, వసతి, వైద్యం, విద్య సమకూర్చడంతో సరిపెట్టకుండా, ఆర్థికంగా వారు నిలదొక్కుకునేలా చేయడం' అంటున్న అనుముత్తు సంస్థ నిర్వహణ కోసం తన జీవితాన్నే అంకితం చేశారు.

చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న 67 ఏళ్ల రవికుమార్‌ని ఆస్పత్రిలో చేర్పించి, వైద్యం అందించారు. కోలుకున్న తరువాత కూడా అతని సంరక్షణ కోసం ఓ కేర్‌టేకర్‌ని ఏర్పాటుచేశారు. అలాగే 55 ఏళ్ల ఆటోడ్రైవర్ సుందర్ ఓ ప్రమాదంలో కన్ను, చేతివేళ్లను పోగొట్టుకుని నిరాశ్రయుడు అయ్యాడు. అతనికి వైద్యం చేయించి, ఓ సంచుల దుకాణం పెట్టించారు. 'ఒకప్పుడు సుందర్ పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. ఆకలికి ఉండలేక కనిపించిన వారినల్లా సాయం చేయమని అర్థించేవాడు. కానీ ఇప్పుడు సుందర్ ఆ వీధిలో గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నాడు. రోజుకు రూ.300 సంపాదిస్తున్నాడు. ఇది నాకు చాలా సంతోషంగా ఉంది' అంటూ అనుముత్తు చెబుతున్నారు.

సంస్థ తరపున అనుముత్తు ఎంతోమందికి ఆశ్రయం కల్పించారు. మహిళలకు కుట్టు మిషను నేర్పించి, వాళ్లతో సొంతంగా షాపులు పెట్టించారు. పత్తి ఉత్పత్తులను తయారుచేసే బృందాలుగా వారిని తయారు చేశారు. ఇంకా టీస్టాళ్లు పెట్టించారు. హోటళ్లు, చిల్లర దుకాణాలు, సైకిళ్ల ఇలా ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రతి అవకాశాన్నిఅందించారు. 'ఆశ్రయం అంటే జీవితానికి భరోసా కల్పించడం' అని చెబుతున్న అనుముత్తు జీవితం స్ఫూర్తిదాయకం.



కోపం ఎక్కువగా వస్తోందా!

కోపం సర్వసాధారణమైన భావన. మనలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో కచ్చితంగా కోపం వస్తుంది. వినడానికి చిన్న సమస్యే అయినా కొన్ని సందర్భాల్లో కోపం వల్ల మానసిక ఆరోగ్యం కోల్పోవడమే కాక, బీపీ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ కోపానికి హార్మోన్లు కారణమని ఎంతమందికి తెలుసు? సాధారణంగా మనకు కోపం వచ్చినప్పుడల్లా.. శరీరంలోని రెండు ప్రధాన హార్మోన్లు, అడ్రినలిన్ కార్టిసాల్ అధిక మోతాదులో ఉత్పత్తి అవుతాయి. విపరీతమైన ఒత్తిడికి గురైనా లేదా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడే ఈ హార్మోన్లను విడుదల అవుతాయి. వీటివల్ల హృదయ స్పందన రేటు పెరుగుతుంది. కండరాలు ఉద్రిక్తంగా మారతాయి. ఆరోగ్యానికి చేటు చేసే ఈ కోపాన్ని తగ్గించుకోవడం చాలా మంచిది.

కోపాన్ని ఎలా నియంత్రించుకోవాలి..

- కోపం రాగానే లోతైన శ్వాస తీసుకోని నెమ్మదిగా గాలిని బయటకు వదలాలి. ఇలా చేయడం వల్ల మనస్సుకు ప్రశాంతం లభిస్తుంది. దీనివల్ల మెదడుకు పుష్కలంగా ఆక్సిజన్ అందుతుంది.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడి, ఒత్తిడి తగ్గుతుంది. తద్వారా కోపం వచ్చే అవకాశాలు తగ్గిపోతాయి. మానసిక ప్రశాంతత కూడా తోడవుతుంది.
- తరచూ కోపానికి గురవుతుంటే మాత్రం, ఆ భావన ఎందుకు కలుగుతుందన్న విషయంపై లోతుగా ఆలోచించాలి. అంతలా ఇబ్బంది పెడుతోన్న అంశాన్ని తెలుసుకొని దాన్ని అధిగమించేందుకు ప్రయత్నించాలి.
- భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడవచ్చు.

శరవేగంగా 'లగ్గం' చిత్రీకరణ

సుభిషి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్న తాజా ప్రాజెక్టు 'లగ్గం'. రమేష్ చెప్పాల ఈ సినిమాకు రచన -దర్శకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 5న పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. గురువారంతో ఈ చిత్ర మొదటి షెడ్యూల్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు. ఫిబ్రవరి 23 నుంచి వరపూజతో రెండవ షెడ్యూల్ ప్రారంభం అవుతుందని, మొదటి షెడ్యూల్ కామారెడ్డి పరిసర ప్రాంతాల్లో పచ్చని పొలాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిందని.. ఈ సందర్భంగా మేకర్స్ తెలియజేశారు. రాజేంద్రప్రసాద్, రోహిణి, సాయి రోనాక్, ఎల్.బి శ్రీరామ్, సప్తగిరి వంటి సీనియర్ నటులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు.

మెడ్రాస్ కారన్‌లో నిహారిక

మలయాళ హీరో షాన్ నిగమ్, కలైయ రసన్, నిహారిక, ఐశ్వర్యదత్తా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం మెడ్రాస్ కారన్. కొన్నాళ్ల విరామం తర్వాత నిహారిక నటిస్తున్న చిత్రం ఇది. వాలి మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమానికి నిహారిక కూడా హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా దర్శకుడు పాన్‌రామ్ హాజరై మాట్లాడారు. మెడ్రాస్ కారన్ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. వాలి మోహన్‌దాస్ మాట్లాడుతూ చెన్నై, మధురై, కొచ్చి ప్రాంతాల్లో షూటింగ్ జరుపుతామన్నారు.

విడుదలకు సిద్ధంగా 'డియర్ ఉమ'

పృథ్వీ అంబర్, సుమయా రెడ్డి జంటగా నటించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేష్ మహదేవ్ దర్శకత్వం వహిస్తున్నారు. సుమయారెడ్డి నిర్మాత. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఇటీవలే ఈ సినిమా టీజర్ కూడా విడుదలైన విషయం తెలిసిందే. సంగీతాన్ని రథన్ అందించారు. విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చిత్ర యూనిట్ టీజర్ విడుదల సందర్భంగా ప్రకటించింది.

గాయంతో షూటింగ్ మరింత ఆలస్యం!



బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ కాలికి గాయమైంది. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆయన తెలిపారు. నడుముకు బెల్ట్ పెట్టుకుని క్రచెస్ సాయంతో నిలుచున్న ఫొటోను షేర్ చేశారు. 'గతంలో మీలో ఎంతమందికి ఈ క్రచెస్, వీల్ చైర్ అవసరమెచ్చింది? ఆ టైమ్‌లో మీ ఫీలింగ్ ఏంటి?' అని పోస్ట్ చేశారు. కాలి గాయంతో కలిగిన బాధ నుంచి ప్రస్తుతం కోలుకుంటున్నానని చెప్పారు. ఈ మేరకు హృతిక్ ఇన్ స్టాలో సుధీర్ఘమైన పోస్ట్ చేశారు. చిన్నతనంలో తన తాతయ్య స్ట్రెంగ్త్ వాల్యూ గురించి చెప్పిన విషయాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం హృతిక్ వార్-2 చిత్ర షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాలో ఎన్‌టిఆర్‌కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ గాయం కారణంగా ఈ చిత్ర షూటింగ్ వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది.

నేడు 'ఊరు పేరు భైరవ కోన' విడుదల

హీరోగా సందీప్ కిషన్, హీరోయిన్‌గా కావ్య థాపర్ నటించిన చిత్రం ఊరుపేరు భైరవకోన. విఐ ఆనంద్ దర్శకత్వ వహించారు. ఆటంకాలను తొలగించుకుని శుక్రవారంనాడు ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా విడుదలను నిలిపేయాలని కోరుతూ విశాఖకు చెందిన ఫిలిం డిస్ట్రిబ్యూటర్ బత్తుల సత్యనారాయణ (వైజాగ్ సతీష్) హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. ఏజెంట్ మూవీ డిస్ట్రిబ్యూషన్ విషయంలో తొలుత చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం నిర్మాతలు తనకు ప్రసార హక్కులు ఇవ్వలేదని ఆరోపించారు. ఇందుకు వివరణ ఇవ్వాలని కోరినా స్పందించకపోవటంతో తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లుగా సతీష్ తెలిపారు. కేసు విచారించిన న్యాయస్థానం ఊరుపేరు భైరవకోనకు, ఏజెంట్ సినిమాకు సంబంధం లేదనీ, తాజా మూవీ విడుదలను ఆపటం సాధ్యం కాదని చెప్పింది. అయితే, కేసు విచారణ సాగిస్తామన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఏప్రిల్ 4కు వాయిదా వేసింది.

మురుగదాస్ చిత్రంలో..

మురుగదాస్, శివకార్తికేయన్ కాంబినేషన్లో ఓ సినిమా తెరకెక్కుతోంది. గురువారం చిత్ర షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని మురుగదాస్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ చిత్రంలో శివకార్తికేయన్‌కి జంటగా 'సప్త సాగరాలు దాటి' హీరోయిన్ రుక్మిణి వసంత్ నటిస్తున్నారు.

అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. శ్రీ లక్ష్మీ మూవీస్ సంస్థ భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మాస్టర్ దిలీప్ సుబ్బరాయన్ కొరియోగ్రాఫ్ చేయనున్నారు. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించి త్వరలో ప్రకటించనున్నారు.

రోహిత్, జడేజా సెంచరీలు

- టెస్టుల్లో సర్ఫరాజ్ అరంగేట్రం
- భారత్ 326/5

రాజ్‌కోట్: రాజ్‌కోట్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో తొలి రోజు భారత బ్యాటర్లు రాణించారు. తొలి సెషన్‌లో స్వల్ప వ్యవధిలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయినా టీమిండియా సారథి రోహిత్ శర్మ (131; 196 బంతుల్లో 14ఫోర్లు, 3సిక్సర్లు), రవీంద్ర జడేజా (110బ్యాటింగ్; 212 బంతుల్లో 9ఫోర్లు, 2సిక్సర్లు)తో పాటు అరంగేట్ర ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ (62; 66 బంతుల్లో 9ఫోర్లు, సిక్సర్) రాణించారు. దీంతో భారతజట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 86 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 326 పరుగులు చేసింది. జడేజాతో పాటు కుల్‌దీప్ యాదవ్ (1 నాటౌట్) క్రీజులో ఉన్నారు. రాజ్‌కోట్‌లోని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. ఆదిలోనే యశస్వి జైస్వాల్ (10) వికెట్ కోల్పోయింది. మార్క్ వుడ్ భారత్‌ను తొలిదెబ్బ తీశాడు. నాలుగో ఓవర్లో తొలి వికెట్ కోల్పోయిన భారత్‌కు వుడ్ మరో షాకిచ్చాడు. 9 బంతులాడి ఒక్క పరుగు కూడా చేయని శుభ్‌మన్ గిల్‌నూ పెవిలియన్‌కు పంపాడు. నాలుగో స్థానంలో వచ్చిన రజత్ పాటిదార్(5)ను హార్ట్లీ ఔట్ చేశాడు. దీంతో భారత్.. 33 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఆదుకున్న జడేజా-రోహిత్

కష్టాల్లో ఉన్న భారత్‌ను కెప్టెన్ రోహిత్-జడేజా ఆదుకున్నారు. రెండో సెషనల్‌లో వీరిద్దరూ నిలకడగా ఆడి స్కోరు వేగాన్ని పెంచారు. ఆ సెషన్‌లో భారత్ ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఆడింది. మూడో సెషన్ ఆరంభంలోనే రోహిత్ శతకం పూర్తిచేశాడు. టెస్టులలో రోహిత్‌కు ఇది 11వ శతకం. సెంచరీ తర్వాత సిక్సర్, రెండు ఫోర్లతో వేగంగా ఆడబోయిన రోహిత్‌ను మార్క్‌వుడ్ ఔట్ చేయడంతో 204 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

టెస్టుల్లో సర్ఫరాజ్ అరంగేట్రం...

యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్.. టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. కేవలం 48 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న సర్ఫరాజ్.. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన భారత క్రికెటర్లలో సర్ఫరాజ్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో యువరాజ్ ఆఫ్ పాటియాలా, హార్దిక్ పాండ్యాలు తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. అరంగేట్రం టెస్టులో యువరాజ్ ఆఫ్ పాటియాలా.. 42 బంతుల్లో, హార్దిక్.. 48 బంతుల్లో అర్ధ శతకం బాదారు. జడేజా 84 పరుగుల వద్ద ఉండగా క్రీజులోకి వచ్చిన సర్ఫరాజ్.. రెండంకెల స్కోరు చేరగానే తొలి బౌండరీ బాదాడు. తర్వాత వరుస ఓవర్లలో బంతిని బౌండరీకి తరలిస్తూ.. టామ్ హార్ట్లీ వేసిన 76వ ఓవర్లో ఐదో బంతికి కొట్టిన సిక్సర్ అతడి ఇన్నింగ్స్‌కే హైలైట్. ఆ తర్వాత బంతికే సింగిల్ తీసి అతడు అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. దూకుడుగా ఆడుతున్న సర్ఫరాజ్.. జడేజా 99 పరుగుల వద్ద ఉండగా సమన్వయ లోపంతో రనౌట్ అవడంతో అతడి ఇన్నింగ్స్‌కు తెరపడింది.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తం)..

భారత్ తొలి ఇన్నింగ్స్: 326/5
(రోహిత్-131, జడేజా-110(బ్యాటింగ్), సర్ఫరాజ్(62); వుడ్ 3/69, హార్ట్లీ 1/81)

సర్ఫరాజ్ తండ్రి కంట కన్నీళ్లు..

టెస్టుల్లో యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ అరంగేట్రం చేశాడు. మూడోటెస్ట్ ప్రారంభానికి ముందు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే నుంచి సర్ఫరాజ్ టెస్టు క్యాప్ అందుకున్నాడు. అది చూసి అక్కడే ఉన్న అతని తండ్రి భావోద్వేగాన్ని నియంత్రించుకోలేక ఉబికి వస్తున్న కన్నీళ్లను కట్టడి చేయలేక ఏడ్చేశాడు. తనయుడి చేతుల్లో నుంచి ఆ క్యాప్ తీసుకుని ముద్దులు పెట్టుకుంటూ.. కొడుకును హత్తుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఆ తండ్రి కన్నీళ్ల వెనుక ఎంతో కష్టం, వెలకట్టలేని త్యాగం, ఏళ్ల తరబడి నిరీక్షణ ఉంది. ఆ తండ్రి పేరు నౌషద్ ఖాన్.

టాప్‌సీడ్‌కు రామ్‌కుమార్ ఝలక్



బెంగళూరు: భారత స్టార్ టెన్నిస్ ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్ పెను సంచలనాన్ని నమోదు చేశాడు. బెంగళూరు ఓపెన్ ఎటిపి ఛాలెంజర్స్ టోర్నీలో టాప్‌సీడ్ లూకా నర్దీపై సంచలన విజయం సాధించాడు. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ 1-6, 6-4, 6-4తేడాతో లూకాను చిత్తుచేసి సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 108వ ర్యాంకర్ అయిన లూకా తొలి సర్వ్‌ను 86% గెలుపొందగా.. రామ్‌కుమార్ 92% సాధించడం విశేషం. తొలిసెట్‌లో ఏకంగా మూడు గేమ్ పాయింట్లు చేజార్చుకొని ఆ సెట్‌ను కోల్పోయిన రామ్‌కుమార్.. రెండు, మూడు సెట్‌లలో ప్రత్యర్థి లూకా ఒక్కో గేమ్‌ను బ్రేక్ చేసి విజయాన్ని నమోదు చేసుకున్నాడు.

పారిస్ బెర్త్‌పై టిటిజట్లు చూపు..

నేడు చైనాతో మహిళల జట్టు ఢీ

బూసన్: ప్రపంచ టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో రాణించి పారిస్ బెర్త్ దక్కించుకోవాలని భారత పురుషుల, మహిళల జట్లు ఎదురుచూస్తున్నాయి. నేటినుంచి జరిగే టిటి ఛాంపియన్‌షిప్‌లో 16వ ర్యాంక్‌తో పురుషుల జట్టు, 17వ ర్యాంక్‌తో మహిళల జట్టు బరిలోకి దిగుతున్నాయి. పురుషుల జట్టులో భారత్‌తోపాటు కొరియా, పోలండ్, చిలీ, న్యూజిలాండ్, మహిళల జట్టు ఉన్న గ్రూప్‌లో చైనా, హంగేరీ, స్పెయిన్, ఉజ్బెకిస్తాన్ జట్లు ఉన్నాయి. మొత్తం 8జట్లు ఆడే గ్రూప్‌లో ఐదుజట్లు నాకౌట్‌కు చేరనున్నాయి. క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన జట్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కనుంది. మహిళల జట్టు శుక్రవారం జరిగే తొలి పోరులో టాప్‌సీడ్ చైనాతో తలపడనుంది. ఇక పురుషుల జట్టు శనివారం చిలీతో ఆడనుంది.

పురుషుల టీమ్: హర్మీత్ దేశాయ్, మానవ్ ఠక్కర్, సాథియాన్, శరత్ కమల్, మనుశ్ షా.

మహిళల టీమ్: మనిక బత్రా, శ్రీజ ఆకుల, అర్చన కమత్, అహిక ముఖర్జీ, దియా ఛిత్తలే.

ఊరిస్తున్న విజయం

న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా టెస్ట్

హామిల్టన్: దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండోటెస్ట్ రసకందాయంలో పడింది. మూడోరోజైన గురువారం దక్షిణాఫ్రికా జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 235పరుగులకు ఆలౌట్ కావడంతో న్యూజిలాండ్ జట్టు 267పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ జట్టు మూడోరోజు ఆటముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 40పరుగులు చేసింది. విజయానికి న్యూజిలాండ్ జట్టు మరో 227పరుగులు చేయాల్సి ఉండగా.. దక్షిణాఫ్రికా జట్టు మరో 9వికెట్లు కూల్చితే ఆ జట్టుకు విజయం ఖాయం కానుంది. ఇరుజట్ల మధ్య జరుగుతున్న రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 1-0 ఆధిక్యతలో ఉన్న సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68